


# విజయభాను

Years of Excellence
విజయభాను వార్షికోత్సవ శుభాకాంక్షలు

విశాఖపట్నం, సోమవారం 21-08-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 340 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## జగన్ ఓట్లు అడగటం సిగ్గుచేటు



నంద్యాల : కాపులు, బలిజలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇచ్చింది తెదేపానేనని ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు అన్నారు. రాయల సీమలో బలిజలకు ముఖ్య పదవులు ఇచ్చామని సీఎం పేర్కొన్నారు. నంద్యా లలో బలిజల ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. కాపులను తెదేపాకు దూరం చేసేందుకు కొందరు చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. కాపులకు గుర్తింపు ఇచ్చేది తెదేపా మాత్రమేనని పేర్కొన్నారు. ఎవరూ అడక్కుండానే 2014లో కాపు రిజర్వేషన్ల హామీ ఇచ్చానని.. వారి ఆర్థిక పరిస్థితి చూశాకే పిఠాపురంలో ప్రకటన చేశానని గుర్తుచేశారు.

కాపుల రిజర్వేషన్లు అమలు చేస్తామని 2004, 2009లో మేనిఫెస్టోలో పెట్టారని.. అప్పుడు అమలు చేయనివారిపై మాట్లాడని కొందరు ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తున్నారని అన్నారు. చిత్తశుద్ధితో

తరువాయి 2లో

### మోదీ, అమిత్ షా నేడు
## కీలక సమావేశం



న్యూఢిల్లీ : ప్రభుత్వాల్లో బీజేపీ భాగస్వామ్యం ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి, సాంఘిక సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై భారతీయ జనతా పార్టీ సోమవారం సమీక్షించబోతోంది. ఈ సమీక్షలో బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొంటారు. 13 మంది ముఖ్యమంత్రులు, ఆరుగురు ఉప ముఖ్యమంత్రులు, కొందరు కేబినెట్ మంత్రులు ఈ సమావేశానికి హాజరవుతారని బీజేపీ వర్గాలు తెలిపాయి.

మోదీ ఇటువంటి సమావేశాన్ని నిర్వహించడం ఇది మూడోసారి. కేంద్ర ప్రభుత్వ ప్రధాన పథకాల అమలు తీరును ఈ సమావేశంలో సమీక్షిస్తారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం అమిత్ షా రూపొందించిన బ్లూ ప్రింట్‌పై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

అదే విధంగా ముఖ్యమంత్రులు కూడా తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పథకాల గురించి కూడా వివరిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి.

### ప్రభుత్వరంగ సంస్థలను
## స్వప్రయోజనాలకు వాడవద్దు


- కుంభకోణాల్లో ఇరుక్కుంటే సహించేది లేదు
- అవినీతి రహిత ప్రభుత్వంగా ప్రజలు ఆదరించాలి
- సత్ఫలితాలు ఇస్తున్న మోదీ హెచ్చరికలు



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొదుపు చర్యల్లో భాగంగా మరో కొరడా ఝుళిపించారు. ప్రముఖ కేంద్ర మంత్రు లు ఫైవ్ స్టార్ హోటళ్ళలో బస చేస్తుండటంపై మోదీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఫైవ్ స్టార్ హోటళ్ళలో బస చేయడం, ప్రభుత్వరంగ సంస్థల నుంచి ప్రయోజనాలను పొందడం నుంచి దూరంగా ఉండాలని కేంద్ర మంత్రులను మోదీ కోరినట్లు సమాచారం. కొందరు మంత్రులు ప్రభుత్వం సమకూర్చిన వసతులలో కాకుండా ఫైవ్ స్టార్ హోటళ్ళలో బస చేస్తుండటాన్ని ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. కొందరు మంత్రులు తమ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల వాహనాలను స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పినట్లు సమాచారం. ఇటువంటి వ్యవహారాలను తాను సహించబోనని స్పష్టం చేశారని తెలుస్తోంది. అవినీతికి పాల్పడుతూ కుంభకోణాల్లో ఇరుక్కుంటే సహించేది లేదని మంత్రులకు ప్రధాని తేల్చి చెప్పారు. 2019 ఎన్నికలకు ఇంకా రెండేళ్లు మాత్రమే ఉన్నందున అవినీతి రహిత

తరువాయి 2లో

## 2019 వరకూ ఎన్నికలకు దూరం: పవన్ కళ్యాణ్



హైదరాబాద్: 2019 వరకూ ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయమని, ఆలోపు జరిగే ప్రతి ఎన్నికకు దూరంగా ఉంటామని జనసేన జనసేన అధ్యక్షుడు, ప్రముఖ హీరో, పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం జరుగుతోందని ఆ తరువాతే ఎన్నికలకు వెళతామన్నారు. అప్పటివరకూ జరిగే ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయమని, ఏ పార్టీకి, ఏ అభ్యర్థికి జనసేన మద్దతు ఉండదని పవన్ అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికపై పవన్ కళ్యాణ్ గతంలోనే స్పష్టత ఇచ్చారు. నంద్యాల ఉప ఎన్నికల్లో తాము తటస్థంగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. జనసేన

తరువాయి 2లో

## విమానాశ్రయంలో క్యాంటీన్ ప్రారంభం



గన్నవరం: గన్నవరం విమానాశ్రయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఆరోగ్యశాఖా మంత్రి డా.కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 70లక్షల మందికి ఎమ్మార్ టీకాలు ఉచితంగా వేసినట్లు తెలిపారు. ఇప్పటికి పాఠశాలలు, అంగన్‌వాడీల పరిధిలోని పిల్లలకు టీకాలు వేయడం పూర్తయ్యిందని చెప్పారు. మురికివాడలు, సంచార జాతుల పిల్లలకు వేస్తామన్నారు. కర్నూలులో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి రూ.70కోట్లు విడుదలయ్యాయని తెలిపారు.


## రైల్వే మంత్రి స్పందించారు



న్యూఢిల్లీ : ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి కారణాన్ని ఆదివారం సాయంత్రానికి గుర్తించాలని రైల్వే మంత్రి సురేశ్ ప్రభు ఆదేశించారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా ప్రమాదానికి తప్పు చేసినవారిని నిర్ధారించాలని రైల్వే బోర్డు చైర్మన్‌ను ఆదేశించారు. బోర్డు కార్యకలాపాల్లో ఉదాసీనతను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. పూరీ నుంచి హరిద్వార్ వెళ్తున్న ఈ రైలు శనివారం సాయంత్రం ప్రమాదానికి గురవడంతో 23 మంది మరణించారు, సుమారు 100 మంది గాయపడ్డారు.


ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్‌లో 7 బోగీలు పట్టాలు తప్పినట్లు సురేశ్ ప్రభు తెలిపారు. పునరుద్ధరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులకు సాధ్యమైనంత ఉత్తమ వైద్య సంరక్షణను అందజేస్తున్నట్లు తెలిపారు. పరిస్థితిని నిశితంగా సమీక్షిస్తున్నట్లు వివరించారు.

### నోట్ల రద్దుతో మావోయిస్టులు
## వేర్పాటువాదుల నడ్డి విరిచాం



ముంబై: పెద్ద నోట్ల రద్దుతో దేశంలోని పలు ప్రాంతాల్లో మావోయిస్టులు, జమ్మూకశ్మీర్‌లోని వేర్పాటువాదులు నిధుల కొరత తో కుదేలయ్యారని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో రాళ్లు రువ్వుడు ఘటనల్లో పాల్గొంటున్న నిరసనకారుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ముంబై బీజేపీ అధ్యక్షుడు ఆశిష్ షెలార్ ఆదివారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో 'న్యూ ఇండియా ప్లెడ్జ్' అనే అంశంపై జైట్లీ మాట్లాడుతూ, నోట్ల రద్దు నిర్ణయం తర్వాత జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదులు, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో వేర్పాటువాదులు తీవ్ర నిధుల కొరతలో చిక్కుకున్నారని చెప్పారు. నోట్ల రద్దుకు ముందు కశ్మీర్‌లో నిరసనల పేరుతో వేలాది మంది రోడ్లపైకి వచ్చి రాళ్లు రువ్వేవారని, ఇప్పుడు ఆందోళన సమయంలో పట్టుమని 25 మంది కూడా రోడ్లపైకి రావడం లేదన్నారు. 2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగిన ప్రయోజనాలను జైట్లీ మరింత వివరిస్తూ, ఇంతకుముందు లోపాయికారీగా బయటే డబ్బు చలామణీ అయ్యేదని, పెద్ద నోట్ల రద్దు తర్వాత బ్యాంకింగ్ వ్యవస్థలోకి ఆ సొమ్ము వచ్చి చేరిందని చెప్పారు. బీజేపీ 'నవభారత నిర్మాణం' లక్ష్యంలో భాగంగా కీలకమైన రక్షణ, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాలకు హెచ్చు నిధులు ఖర్చు చేయాలనుకుంటున్నట్టు తెలిపారు. 7 నుంచి 7.5 శాతం వృద్ధి రేటు పట్ల మోదీ ప్రభుత్వం సంతృప్తికరంగా లేదని జైట్లీ అన్నారు. జాతి ప్రయోజనాల దృష్ట్యా వృద్ధి రేటు పుంజుకునేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు కొనసాగిస్తుందని చెప్పారు. మోదీ సర్కార్ మూడేళ్ల పాలనలో పలు విజయాలు సాధించిందని, జీఎస్‌టీ అమలు, నోట్ల రద్దు, బినామీ లావాదేవీలకు సంబంధించిన చట్టాల సవరణ, పారదర్శకంగా స్పెక్ట్రం, సహజ వనరుల కేటాయింపులు, వివిధ దేశాలతో డబుల్ టేక్సేషన్ అవాయిడెన్స్ ఒప్పందాలు చేసుకోవడం వంటివి వీటిల్లో కీలకమని జైట్లీ తెలిపారు.

### టేకిట్ ఈజీ



డ్రెస్ మార్చుకుని రారా!! హైకోర్టుకు ఇలా వెళితే ఒప్పుకోరు. డ్రెస్‌కోడ్ పెట్టారు తెలీదా!!

## నా ఆరోగ్యంపై పుకార్లు నమ్మొద్దు: పారికర్



పనాజీ: తన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లపై గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ స్పందించారు. తాను పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. ఆగస్టు 23న జరిగే ఉప ఎన్నికను దృష్టిలో పెట్టుకుని ప్రత్యర్థులు ఇటువంటి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్ల క్రితమే నాకు యాంజియోప్లాస్టీ జరిగింది. అప్పటి నుంచి ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్యంపై వైద్యుల నుంచి సలహాలు తీసుకోవడం అలవాటు. ఎప్పటిలాగే ఈ సారి కూడా అలాగే వెళ్లి చెకప్ చేయించుకున్నా. అయితే వైద్యులు యాంజియోగ్రఫీ చేస్తే మంచిదని

తరువాయి 2లో

## ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌కు భారీ షాక్



హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) భన్వర్‌లాల్‌కు తెలంగాణ ప్రభుత్వం మొండి చెయ్యి చూపించింది. ఆయన ఇన్‌ఛార్జి అలవెన్స్ కోసం చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత భన్వర్‌లాల్ తెలంగాణ రాష్ట్రానికి ఇన్‌ఛార్జి సీఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తూ, తెలంగాణ బాధ్యతలను కూడా అప్పగించింది. అప్పటి నుంచి ఆయన ఇరు రాష్ట్రాలకు సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ విధానాల ప్రకారం వేరొక శాఖకు



## పోలవరం ప్రాజెక్టు వ్యయాన్ని

# కేంద్రమే భరించాలి

### పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అఖిలపక్ష నాయకుల వినతిపత్రం



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు పూర్తి వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే బేషరతుగా భరించాలని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి కోరింది. ఉదయం మహాత్మాగాంధీ రోడ్డులోని ఒక హెూటల్‌లో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (జలవనరులు) ఛైర్మన్ హుకుంసింగ్ ఇతర సభ్యులను కృష్ణాడెల్టా పరిరక్షణ సమితి కన్వీనర్ కొలనుకొండ శివాజీ ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు కలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు సహా పలు అంశాలపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నిర్మాణబాధ్యతను అప్పగించినట్లు కేంద్రం చెబుతోందని అయితే 2010-11 ప్రాజెక్టు అంచనాల ప్రకారం రూ.16,010.45 కోట్లు మాత్రమే భరిస్తామనటం సరికాదన్నారు. ఐదేళ్ల కాల వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేయకపోతే ఇచ్చిన ఆర్థిక సాయాన్ని అప్పుగా పరిగణిస్తామని షరతులు విధించటాన్ని ఖండించారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో 25 శాతం కూడా నీరు చేరలేదని ఈ పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టును త్వరతిగతిన పూర్తి చేసి గోదావరి జలాలను వినియోగించుకోవటం తప్ప గత్యంతరం లేదన్నారు. గంగానది ప్రక్షాళనకు రూ.20వేల కోట్లు మంజూరు చేసిన కేంద్రం, విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి తగిన విధంగా నిధులు మంజూరు చేయకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. అమరావతి నుంచి మురుగునీరు కృష్ణానదిలో కలవకుండా మురుగునీటి శుద్ధి ప్లాంట్లను, నదిఘాట్లను ఏర్పాటు చేయాలని కొలనుకొండ శివాజీ తదితర అఖిల పక్ష నాయకులు కోరారు.కార్యక్రమంలో వైకాపా నాయకులు మల్లాది విష్ణు, కాంగ్రెస్ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, యలమందరావు, అల్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలే తెదేపాకు వెన్నెముక




నంద్యాల :తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక లాంటి వారని రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. శ స్థానిక స్వామి వివేకానంద ఆడిటోరియంలో వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశం రాష్ట్ర మాజీ ఆర్ఐసీ ఛైర్మన్ ఎ.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, అనంతపురం ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్సీ వావివాల సునీత, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ దేవెళ్ల మురళి, శాలివాహన కార్పొరేషన్ అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్రలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ వడ్డెర్లను గుర్తించి వారికి కార్పొరేషన్ పదవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. వడ్డెర్లను బీసీల్లో చాలా వెనుకబడి ఉన్నారని తెలిపారు. వీరిని అన్నీ పార్టీలు ఓట్ల కోసమే వాడు కున్నాయి తెదేపా మాత్రమే గుర్తించి అభివృద్ధికి తోడ్పడిందన్నారు. కార్పొరేషన్‌కు రూ.కోట్లు అందజేశారన్నారు. పదేళ్ల తర్వాత వడ్డెర్ల సతమావేశం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి భూమా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమస్యలేవైనా తమ దృష్టికి తీసుకు వస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు తిరుపాలు బాబు, కుంచెపు శ్రీనివాసులు, నరసింహులు, లక్ష్మీకాంతయ్య, వడ్డె శ్రీను, నాన్న, సుబ్బారాయుడు, హరిబాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా గుండ్లకమ్మను తీర్చిదిద్దాలి

### జలాశయం సందర్శనలో కలెక్టర్

మల్లవరం : గుండ్లకమ్మ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ పేర్కొన్నారు. మద్దిపాడు మండలం మల్లవరంలోని జలాశయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. డ్యామ్ కట్టపై ఉన్న వ్యర్థాలను తొలగించి... పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇక్కడి ఉద్యానాలను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జలాశయం దిగువ ప్రాంతాల్లో అడ్డుకట్టలు వేసి... నీటిని దుర్వినియోగం చేసే వారిపై వెంటనే చర్యలు తీసుకుని, ప్రతి గ్రామా నికి నీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వరద నీటిని జాగ్రత్తగా నిల్వచేసి... తాగు, ఖరీఫ్ సాగు అవసరాలు తీరేలా చూడాలన్నారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉన్నందున... అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనం తరం... అక్కడి వేంకటేశుని ఆలయంలో పూజాధికాలు చేపట్టారు. రైతులకు నీరం దేలా చర్యలు తీసుకోవా లని రైతు సంఘం నాయ కులు వరహాలచౌదరి కలె క్టర్‌ను కోరారు. తమ పొలాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడు తున్నారని... ఈ కారణంగా చాలా సమస్యలు తలెత్తుతున్నాయని అన్నంగి రైతులు విన్నవిం చారు. కార్యక్రమంలో జేసీ నాగలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసరావు, జలాశయం ఎస్‌ఈ రెడ్డయ్య, తహసీల్దారు కేఎల్ నరసింహారావు, సర్పంచి వేణు బాబు, అధికారులు పాల్గొన్నారు.

## తమిళుల హక్కుల కోసం జయ పోరాడారు: వైగో

చెన్నై : తమిళుల హక్కుల కోసం దివంగత ముఖ్యమంత్రి జయలలిత చేసిన పోరాటాలు అసాధారణమని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు.

కరూర్‌లో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ తమిళనాడులోని కావేరీ డెల్టా ప్రాంతాల్లో మీథేన్, హైడ్రోకార్బన్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా మూడేళ్లుగా నిర్విరామంగా పర్యటించి ప్రజలను సంఘటితం చేస్తున్నానన్నారు. కర్ణాటకలోని మేకెదాటులో ఆనకట్ట నిర్మాణంపై 2015 డిసెంబరు 7, 8వ తేదీల్లో ఆ రాష్ట్ర మంత్రి ఆనందకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్ పాల్గొని భరోసా ఇచ్చారని, ఫలితంగా ప్రస్తుతం అక్కడ ఆనకట్ట నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆనకట్ట నిర్మాణ పనులకు అభ్యంతరం లేదంటూ రాష్ట్రానికి జలాలు విడుదల చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో తమిళనాడు తరఫు న్యాయవాది పేర్కొనడం బాధాకరమన్నారు.

## మార్కెట్లో డిస్కవరీ ఎస్‌యువి

విశాఖపట్నం : ల్యాండ్ రోవర్ సంస్థ నుండి నూతన ఫిఫ్త్ జనరేషన్ డిస్కవరీ ఎస్‌యువి కార్ల అమ్మకాలకు నవంబర్ నెల నుండి బుకింగ్‌లు ప్రారంభించినట్లు జాగ్వర్ ల్యాండ్ రోవర్ ఇండియా మేనేజర్ రోహిత్ సూరి పేర్కొన్నారు. డిస్కవరి కారు మూడు వరసుల్లో ఏడు సీట్లు కలిగి ప్రయాణానికి అత్యంత సౌకర్యవంతంగా రూపొందించడం జరిగిందన్నారు. తిరుగులేని ఆధునిక ఆటోమొబైల్ పరిజ్ఞానంతో వినియోగదారుల జీవన విధానానికి అనుగుణంగా వుంటుందని తెలిపారు. ప్రపంచంలో నాణ్యమైన ఫ్యామిలి ఎస్‌యువి కారుగా దీనిని వినియోగదారులు గుర్తించి ఆదరిస్తారని కోరారు. దేశంలో 27 అదికృత డీలర్లు ద్వారా నూతన డిస్కవరీ బుకింగ్‌లు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

# మేడ్చల్‌లో బాలుడి అపహరణ కలకలం

హైదరాబాద్ : మేడ్చల్‌లో ఓ బాలుడి కిడ్నాప్ సంఘటన కలకలం చోటుచేసుకుంది. పేట్ బషీరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత వివరాలు వెల్లడించారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి కిష్టాపూర్ అర్చన కాలనీలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వై.గిరిబాబు.. భార్య, కుమారుడు మణిధర్(14)తో కలిసి కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. గిరిబాబు కొంతకాలం దుబాయ్‌కు వెళ్లి వచ్చాడు. మణిధర్ మేడ్చల్ పట్టణంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే పాఠశాలకు సైకిల్‌పై బయలు దేరాడు. మేడ్చల్-కిష్టాపూర్ మార్గంలో వాగు దాటిన తర్వాత వెండి రంగు కారులో వచ్చిన దుండగులు మాయమాటలు చెప్పి కారులో బాలుడిని తీసుకెళ్లారు. బాలుడి వద్ద తండ్రి ఫోన్ నెంబర్‌ని తీసుకున్న దుండగులు రూ.10లక్షలు ఇవ్వాలని, లేకుంటే బాలుడికి అపాయం తలపెడతామని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన తల్లిదండ్రులు వెంటనే స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీపీ ఆదేశాలతో పది బృందాలను రంగంలోకి దించారు. నిందితుల ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు విచారించారు. సాయంత్రం 4 గంటల సమయంలో పూడూరు పరిధిలో ఓ క్రషర్ వద్ద బాలుడు ఉన్నట్లు సమాచారాన్ని గ్రామస్థులు పోలీసులకు అందించారు. వారు అక్కడకు



చేరుకొని బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడిని బండరాళ్లలో బంధించగా.. ధైర్యం చేసి బయటకు వచ్చినట్లు ఏసీపీ తెలిపారు. కిడ్నాపర్ల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామన్నారు.

సీపీ సూచనల మేరకు సాహస బాలుర అవార్డు కోసం మణిధర్ పేరును పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మేడ్చల్, శామీర్‌పేట, పేట్‌బషీరాబాద్ సీఐలు వెంకట్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రవిచంద్ర, ఎస్సైలు గనేష్, నాయుడు, వెంకటేశం, వీర్రబహ్మాం, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## స్వప్రయోజనాలకు వాడవద్దు

ప్రభుత్వంగా ప్రజలు ఆదరించేలా నడుచుకోవాలని మంత్రులకు సూచించారు.

బ్యూరోక్రాట్లు ఫస్ట్‌క్లాస్ టిక్కెట్‌పై విమానాల్లో ప్రయాణాలు, ఐదు నక్షత్రాల హోటళ్లలో సమావేశాలను నిర్వహించడాన్ని మానుకోవాలని మోదీ ప్రభుత్వం గతంలోనే ఆదేశించారు. ఈ హెచ్చరికలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థల వాహనాలను తమ కోసం తేవద్దని మంత్రులు తమ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

## నా ఆరోగ్యంపై పుకార్లు నమ్మొద్దు: పారికర్

చెప్పారు. చేసేయండని వారికి చెప్పా. మూడు గంటల్లోనే ఆసుపత్రి నుంచి బయటకి వచ్చా. అందరికీ ఉన్నట్టే నాకు చిన్న చిన్న ఆరోగ్యసమస్యలున్నాయి. మొత్తానికి నేను ఆరోగ్యంగానే ఉన్నాను అని పారికర్ శనివారం అన్నారు. గతంలో నేను 82 కిలోల బరువుండేవాణ్ని, ఈ మధ్యనే ఏనిమిది కిలోల బరువు తగ్గి 75కి చేరుకున్నాను. నేను ఇప్పుడు పరిపూర్ణ ఆరోగ్యవంతుణ్ని అని పారికర్ తెలిపారు.

## ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌కు భారీ షాక్

సంబంధించిన పూర్తి అదనపు బాధ్యతలను ఏ అధికారికైనా అప్పగిస్తే, ఆయన జీతంలో 20 శాతం సొమ్మును అలవెన్స్‌గా చెల్లించాలి. భన్వర్‌లాల్ జీతం నెలకు రూ.2.25 లక్షలు. అంటే తెలంగాణ సీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహించినందుకు నెలకు రూ.45 వేల వరకు పొందేందుకు అర్హులు. అంటే ఆయనకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.16 లక్షలు చెల్లించవలసి ఉంది.

ఈ సొమ్మును చెల్లించాలని భన్వర్‌లాల్ రాసిన లేఖపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఆయన తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగి కాదని, ఉద్యోగి కానివారికి అలవెన్స్ చెల్లించజాలమని తెలిపింది.

## 2019 వరకూ ఎన్నికలకు దూరం: పవన్ కల్యాణ్

కార్యకర్తలు అభిప్రాయం తీసుకొనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏ పార్టీ అయిన జనసేన మద్దతు తమ పార్టీకే ఉందని చెపితే నమ్మవద్దని సూచించారు. తాము ఎవరికో మద్దతు ఇస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని పవన్ కల్యాణ్ అన్నారు.

## జగన్ ఓట్లు అడగటం సిగ్గుచేటు

తెదేపా మంజునాథ కమిషన్ వేసిందని.. కమిషన్ నివేదిక వచ్చాక రిజర్వేషన్లపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈలోగా కాపు కార్పొరేషన్ ద్వారా వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

నంద్యాల ఉప ఎన్నికలో తెదేపా అభ్యర్థిని బలపరచాలని చంద్రబాబు కోరారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వైకాపా అభ్యర్థి వల్ల నంద్యాలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఓట్ల కోసం ప్రతిపక్ష నేత నంద్యాలపై ఎక్కడాలేని ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. కాల్చండి.. ఉరితీయండి అంటూ మాట్లాడే నేతను సమర్థిస్తారా..? అని ప్రశ్నించారు.నంద్యాలలో అవినీతికి పాల్పడిన జగన్ ఓట్లు అడగటం సిగ్గుచేటని అన్నారు.

## 'కాఫీ విత్ కలెక్టర్' ప్రారంభం

చెన్నై : విద్యార్థులు అందరూ తమలోని ప్రతిభకు పదును పెట్టాలని తూత్తుకుడి జిల్లా కలెక్టరు ఎన్.వెంకటేశ్ సూచించారు. ఆయన పాఠశాల, కళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. 'కాఫీ విత్ కలెక్టర్' పేరిట జరిగిన ఈ నూతన కార్యక్రమానికి విద్యార్థులతోపాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ప్రతిభ కలిగి ఉంటారని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశాభివృద్ధికి విద్యార్థుల నుంచి సలహాలు, సూచనలు అందితే మంచిదని అభిప్రాయపడ్డారు. తనకు ఉద్యోగ పరంగా ఎన్నో రకాలైన సమస్యలు ఉన్నప్పటికీ విద్యార్థులతో సమావేశమైనందుకు సంతోషంగా ఉందన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఏదైనా సందేహాలుంటే తనను సంప్రదించాల్సిందిగా సూచించారు.

అందరూ ఆత్మస్థైర్యాన్ని పెంచు కోవాలని చెప్పారు. ఉన్నత విద్యను అభ్యసించే ముందు జీవితానికి అది ఎంతవరకు ఉపయోగపడుతుందో ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. తూత్తుకుడి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను తనకు చెప్పాల్సిందిగా కలెక్టరు కోరారు.

## భూసేకరణపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

కొడవలూరు : మండలంలోని బొడ్డువారి పాళెం రెవెన్యూ పరిధిలోని చంద్రశేఖరపురంలో 384 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను ఏపీఐఐసీకి అప్పగించరాదని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరి హారాన్ని అందించాలని కోరుతూ సీజేఎఫ్ఎస్ భూముల లబ్ధిదారులు పలువురు రైతులు ఇటీవల హైకోర్టులో కేసు వేశారు. దీంతో ప్రముఖ సీనియర్ న్యాయవాది రామచంద్రరావు రైతుల పక్షాన హైకోర్టులో వాదనలు వినిపించారు. 40 ఏళ్లుగా రైతుల ఆధీనంలో ఉన్న 384 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను ఏపీఐఐసీ స్వాధీనం చేసుకొని 132.5 ఎకరాలకు మాత్రమే నామమాత్రంగా పరిహారాన్ని చెల్లిం చారని కోర్టుకు తెలిపారు. ఈ భూముల పక్కనే ఉన్న ఇఫ్కో కిసాన్ సెజ్‌లో కోకోకోలా కంపెనీకు ఎకరా రూ.56 లక్షలకు ఇవ్వడాన్ని చూపిస్తూ రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.1.42 కోట్లు మంజూరు చేయాలని వాదనలు వినిపించారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తి ఏ.రామలింగేశ్వరావు రైతుల వాదనలనపై స్పందిస్తూ చంద్రశేఖరపురం సీజేఎఫ్ భూములను రైతుల ఆధీనంలోనే ఉంచాలని ప్రభుత్వం, జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు, నెల్లూరు ఆర్డీవో, కొడవలూరు తహశీల్దారు, ఏపీఐఐసీ ఛై%ర్మన్లను ఆదేశించింది.

విచారణ మరో నాలుగు వారాలకు వాయిదా వేసింది. దగదర్తి మండలంలోని సున్నపుబట్టి, అనంతరం రైతులు కూడా హైకోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం.

## రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయ్

నెల్లూరు : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, అందుకు పోలీసు, ట్రాన్స్‌పోర్టు, ఆర్టీసీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాలే కారణమని జిల్లా కలెక్టరు ముత్యాలరాజు అన్నారు. నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా రోడ్డుసేఫ్టీ కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాలు, మరణాలు, క్షతగాత్రులు ఇతర అంశాలపై చర్చించారు. ఈ ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై డివిజన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. శివరామప్రసాద్ మాట్లాడుతూ జాతీయరహదారి-16కి సంబంధించి జిల్లాలో తడ నుంచి కావలి వరకు గుర్తించిన ప్రమాదకరమైన జంక్షన్‌ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కలెక్టరు స్పందిస్తూ గుర్తించిన ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఎక్కువ ఉన్న సమయాలల్లో వీడియో తీయించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయరహదారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం వల్ల చాలా వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయ న్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్సులేకుండా వాహనాలు నడుపుతున్నవారిపై కేసులు నమోదు చేయడంతో చాలావరకు ఈ తరహా కేసులు తగ్గాయని ఆయన వివరించారు. ఆటో డ్రైవర్‌లందరికీ ఓ వారం రోజులు సమయం ఇచ్చా మని శనివారం నుంచి నిబంధనల ప్రకారం చర్యలుంటాయని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ మేనేజరు విద్యవాణిని గతంలో నేషనల్ హైవేపై తీసుకున్న నిర్ణయాలను ఎలా అమలు చేశారని ముత్యాలరాజు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్‌ఈ, పీడీ విజయ్‌కుమార్, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ సత్యనారాయణ, నేషనల్ హైవే ఇంజినీరు విజయభాస్కర్, వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వర సుందరం, పోలీసు, ఆర్టీఏ అధికారులు పాల్గొన్నారు.

## సబ్బవరం భూములతో సమానంగా ఇరువాడ భూముల ధర

### ఎన్‌హెచ్-16 భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుబ్బరాజు హామీ

సబ్బవరం : సబ్బవరం భూములతో సమానంగా ఇరువాడ భూములకు ధర నిర్ణయిస్తామని ఎన్‌హెచ్-16 (అనకాపల్లి-ఆనందపురం) జాతీయ రహదారి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ.సుబ్బరాజు రైతులకు హామీ ఇచ్చారు. సబ్బవరం మండలం ఇరువాడ గ్రామంలో భూముల సర్వే బృందాన్ని శుక్రవారం గ్రామస్థులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుబ్బరాజు ఇరువాడ రైతులతో సమావేశమయ్యారు. వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. సబ్బవరంలో ఎకరాకు ఎంత చెల్లిస్తే అంతే మొత్తం ఇరువాడ భూములకు వర్తించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మునగ, బొప్పాయి, సరుగుడు తోటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించదన్నారు. ఇక్కడి రైతులు ఈ తోటల మీదే ఆధారపడి బతుకుతున్నందున వీటికీ పరిహారం చెల్లిస్తామన్నారు. రైతులు కోరిన విధంగా పొలాలకు వెళ్లేందుకు సేవా రహదారి, చెరువుకు వెళ్లడానికి ప్రత్యేక రహదారి ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. త్రీజీ నోటిఫికేషన్ జరగాలంటే క్షేత్ర స్థాయి సర్వే ముఖ్యమన్నారు. రైతులు తాము కోల్పోతున్న భూముల వివరాలు, చెట్లు, మోటారు షెడ్లు, బావులు, బోర్లు వంటి అన్నింటినీ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్బవరం తహసీల్దారు పి.రామారావు, ఇరువాడ సర్పంచి ఎర్రినాయుడు, బి.శ్రీను, బలిరెడ్డి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి



శృంగవరపుకోట : అగ్రిగోల్డ్ ఖాతాదారుల సమస్య పరిష్కారానికి సెప్టెంబరు 17 డెడ్‌లైన్‌గా విధిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వర్రావు అన్నారు. ఎస్.కోట దేవీగుడి కూడలిలో అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్రవ్యాప్త చైతన్య యాత్రలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగకపోతే ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెబుతామన్నారు.

ప్రతి నియోజకవర్గంలో 10 నుంచి 15 వేల మంది బాధితులుంటారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే మరో ఉద్యమం నిర్మిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామేశ్వర్రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ ఖాతాదారుల, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ మరోవ్యక్తి చనిపోకూడదన్న ఉద్దేశంతో అందరినీ కలుపుకొని ఉద్యమిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు విశ్వనాథరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు ఈవీ నాయుడు, జిల్లా అధ్యక్షులు సూరప్పడు, స్థానిక నాయకులు మద్ది కృష్ణ, మాణిక్యం పాల్గొన్నారు.

## శ్రీవారి క్షేత్రంలో భక్తుల కిటకిట

ద్వారకాతిరుమల : ద్వారకా తిరుమల చినవెంకన్నను దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలిరావడంతో శ్రీవారి క్షేత్రం కిటకిటలాడింది. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకొని తన్మయం పొందారు. సుమారు 25 వేల మంది క్షేత్రానికి వచ్చారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ పరిసరాలు, దర్శన క్యూలు, కేశ ఖండనశాల వద్ద కిటకిటలాడారు. ఆలయ తూర్పు రాజగోపురం వద్ద క్యూల ద్వారా ఆలయం లోపలకు వెళ్లారు. వీఐపీ క్యూల వద్ద కూడా బారులు తీరారు. వర్షం పడుతున్నా లెక్క చేయక భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. దర్శనానంతరం స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కాలినడకన క్షేత్రానికి వచ్చిన భక్తులకు, వృద్ధులకు ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శన సౌకర్యం కల్పించారు. సామాన్య భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు 3 గంటలసమయం పట్టింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ద్వారకాతిరుమల శ్రీవారి ప్రసాదాలను శనివారం అధిక మొత్తంలో విక్రయించినట్లు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. లడ్డూలు 36 వేలు, చక్కెర పొంగలి ప్యాకెట్లు 5509, పులిహోర ప్యాకెట్లు 11,730 విక్రయించామన్నారు. 8462 మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా, 6500 మంది స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు పేర్కొన్నారు.

## ఎన్నికల కార్యాలయం ప్రారంభించిన సునీల్...



కాకినాడ : కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు పురస్కరించుకొని 38వ డివిజన్ దాట్లవారి వీధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం వైసీపీ కాకినాడ పార్లమెంటు కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్‌సిటీ సక్రమంగా సద్వినియోగం అయి నగరాన్ని అభివృది ధపథంలో నడిపించాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ నాయకులు యార్లగడ్డ శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అన్న సంజీవని దుకాణాల్లో 200 రకాల ఔషధాలు : కలెక్టర్

ఏలూరు : జిల్లాలో అన్న సంజీవని దుకాణాల్లో 200 రకాల మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ భాస్కర్ చెప్పారు. డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న పథకాల అమలుతీరుపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ జనరిక్ మందుల ప్రాముఖ్యత గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ శాతం మంది వాటిని కొనుగోలు చేసేలా చేయాలన్నారు. చంద్రన్న బీమా పథకం కింద బాధిత కుటుంబాలకు త్వరితగతిన చెక్కులను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పర్యాటక కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన కలెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఏలూరు గ్రీన్‌సిటీ వద్ద రెండు ఎకరాల్లో ఆడిటోరియం నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కొవ్వూరు గోష్పదక్షేత్రం వద్ద ఆడిటోరియంను నిర్మించడంతో పాటు పర్యాటకుల కోసం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పాపికొండలు, పోలవరం ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దే పనులను ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో పర్యాటకరంగం అభివృద్ధికి నిధులు అందుబాటులో ఉన్నా సకాలంలో ఎందుకు పనులను పూర్తిచేయలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించారు. కొల్లేరు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఇటు పజిల్.. అటు బహుళ అంతస్థుల పార్కింగ్

### వుడా భవన్, గురజాడ క్షేత్రం ప్రాంగణాల్లో ఏర్పాటుకు సన్నాహాలు



విశాఖపట్నం: విశాఖలో బహుళ అంతస్థుల పార్కింగ్ ప్రాంగణాలు.. ఎప్పట్నుంచో జరుగుతున్న ఈ చర్చకు ఒక రూపు వచ్చే రోజులు దగ్గరకొచ్చాయి. పెరుగుతున్న పార్కింగ్ సమస్యకు ఈ చర్యలతో తెరపడనుంది. విశాఖ నగరాభివృద్ధి సంస్థ (వుడా) కార్యాలయంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, వుడా వీసీ బసంత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో సుదీర్ఘంగా సమీక్షించారు. వుడా కార్యదర్శి శ్రీనివాస్, చీఫ్ అర్బన్ ప్లానర్ భవానీ శంకర్, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు రెడ్డి శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు. మల్టీ లెవెల్ పార్కింగ్ నమూనాలలోని కీలకాంశాలు క్రోడీకరించి విశాఖలో పలుచోట్ల బహుళ అంతస్థుల వాహన పార్కింగ్ సముదాయ ప్రాంగణాలు ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. త్వరలో దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఈ నిర్మాణం చేపట్టాలని.. స్మార్ట్ సిటీలో భాగంగా వీటి నిర్మాణానికి నిధుల కేటాయించాలనే ఆలోచనలోనూ అధికారులున్నారు. సమీక్ష అనంతరం చీఫ్ అర్బన్ ప్లానర్ ఆధర్యంలో స్థల పరిశీలన జరిపి ఏ తరహా నిర్మాణం సాధ్యమనే అంశంపై చర్చించారు.

వుడా పిలుపుమేరకు బహుళ అంతస్థుల పార్కింగ్ ప్రాంగణాల నమూనాలతో 10 సంస్థలు ముందుకొచ్చాయి. గోవాకు చెందిన ఎఫెక్టివ్ ఆర్కిటెక్ట్, ప్యారీ పార్కింగ్ సంయుక్తంగా ఓ నమూనాను ప్రదర్శించాయి. బీవీఎస్ ఇంజినీరింగ్ అండ్ ఆటోమేటిక్ సిస్టమ్స్ మేనేజింగ్ పార్టనర్ ఎ.వేణుగోపాల్ నాయుడు కొరియాకు చెందిన హ్యాన్‌కుక్ సంస్థ భాగస్వామ్యంతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. న్యూఢిల్లీకి చెందిన ఆర్చ్ అండ్ డిజైన్స్ సంస్థ మరో ప్రదర్శనను ఇచ్చింది. ఏ నమూనాపైనా అధికారులు పూర్తిస్థాయి సంతృప్తిని వ్యక్తం చేయలేదు.

తొలుత వుడా ఉద్యోగ భవన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బహుళ అంతస్థుల పార్కింగ్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆ పక్కనే వుడా బాలల ప్రాంగణం, గురజాడ కళాక్షేత్రానికి మధ్యలోని పార్కింగ్ స్థలంలో పజిల్ స్ట్రక్చర్ తరహాలో పార్కింగ్ ప్రదేశం నిర్మించాలని భావిస్తున్నారు. వుడా ఎదురు ఖాళీ స్థలం 6,540 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ జీప్లస్ 5లోగానీ, జీప్లస్ 8 తరహా నిర్మాణంగానీ చేపడితే ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు. ఆహ్లాదకరమైన సాగర తీరం కనిపించేలా పై అంతస్థులు వాణిజ్య సముదాయాల కింది వినియోగిస్తూ కింది ఫ్లోర్లు పార్కింగుకు కేటాయించాలనే ఆలోచనలో అధికారులున్నారు. పై అంతస్థుల్లో ఆకట్టుకునే రీతిలో టెర్రస్ గార్డెన్ నిర్మించాలన్న ప్రతిపాదనా ఉంది. గురజాడ కళాక్షేత్రం పక్కనున్న స్థలం 700 చదరపు మీటర్ల స్థలంలో పజిల్ స్ట్రక్చర్ తరహాలో ఐరన్ ఫ్రేమ్‌లతో పార్కింగ్ నిర్మించాలని భావిస్తున్నారు.

## ఈ ఏడాది నుంచి ఐటీఐ తరగతులు

తాడేపల్లిగూడెం : ఈ సంవత్సరం నుంచే తాడేపల్లిగూడేనికి మంజూరైన కేంద్ర ఐటీఐలో తరగతులు నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తెలిపారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం కౌన్సెలింగ్ నుంచే పట్టణంలోని కేంద్ర ఐటీఐకు సీట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరామన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన విద్యార్థులకు తాత్కాలికంగా వసతి గృహాలు ఏర్పాటు చేయకలిగితే సీట్లు ఇస్తామని చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆ దిశగా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణంలోని విమానాశ్రయ భూముల్లో నివాసముంటున్న వారు పట్టాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. భాజపా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ గూడెం భాజపా నియోజకవర్గ కన్వీనర్‌గా నరిషే సోమేశ్వరరావును నియమించినట్లు తెలిపారు. అందరితో మమేకమై పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాజపా ఫ్లోర్ లీడర్ యెగ్గిన నాగబాబు, ప్రముఖ వ్యాపారవేత్త గమిని సుబ్బారావు, భాజపా నాయకులు పోతుల అన్నవరం, ఐనం బాలకృష్ణ, సిర్రాపు శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువత సేవాభావం కలిగి ఉండాలి

చీపురుపల్లి : యువత సేవాభావం కలిగి ఉండాలని యువజన సేవల శాఖ సీఈఓ ఎం.సత్యనారాయణ అన్నారు. చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజన సేవల శాఖ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విపత్తులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై మూడు రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. దీంట్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, వరదలు, విపత్తులు సంభవించే సమయాల్లో యువత కీలకంగా వ్యవహరించి సహాయక కార్యక్రమా లను చేపట్టాలన్నారు. బాధితులను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మూడు రోజులపాటు అన్నింటిపైన శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న దాన్ని అవసరమైన చోట వినియోగించాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ధృవపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.త్రినాథ, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ డి.తాతారావు, సెట్విజ్ సహాయ ప్రబంధకుడు వీవీ అప్పలనాయుడు, చీపురుపల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి ఎ.వెంకటరావు, మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు, ఆశయ సంస్థ అధ్యక్షుడు ఆర్.రమణ, రెడ్‌క్రాస్ క్షేత్ర అధికారి డి.గౌరీశంకర్, శిక్షకుడు బి.సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.




నగరంలో సంత్‌నిరంకారి చారిటబుల్ ఫౌండేషన్ వారు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ వారి ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, వాసవి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విశాఖపట్నం పోర్టుట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ డా.. హర్నాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని దానంచేసి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలి అధ్యక్షులు ప్రేమ్‌మీర్‌పురి, పి.వి. రావు, డి.ఎ.ఆర్. రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు రాజీవ్‌గాంధీ



విశాఖపట్నం : చిరస్మరణీయుడు రాజీవ్‌గాంధీ అని నగర కాంగ్రెస్ కార్యదర్శి కె.గోపాల్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా 31, 33 వార్డుల కూడలిలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌అదాలత్, వినియోగదారుల హక్కు చట్టం వంటి ఎన్నో సంస్కరణలు చేసి చిరస్మరణీయంగా ప్రజల హృదయాలలో నిలిచిపోయారని అటువంటి నాయకుడి విగ్రహం ఈ ప్రాంతంలో ఉండటం ఆనందదాయకమని అన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి దేశ పాలకుల నిర్ణయాత్మకంలో యువతను భాగస్వాములు చేశారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొంపా గోవింద్, నూనెల పోలారావు, నగర యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైల్వేవంతెన నిర్మాణం పూర్తి

గుర్ల : గుర్ల మండలంలోని కెల్ల గ్రామం వద్ద రైల్వేక్రాసింగ్ వంతెన నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. దీంతో తారకరామ ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఒక అడుగు ముందుకు పడిందని చెప్పవచ్చు. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన 24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరానికి ఒక టీఎంసీ తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో తారకరామ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఆనందపురం వద్ద బ్యారేజీ నిర్మాణం పనులు చేపట్టారు. ఇక్కడినుంచి కాలువ ద్వారా పై మండలాలకు సాగునీరు అందించాలన్నది ఉద్దేశం. ఇప్పటికి దశాబ్దం దాటినా దీనికి సంబంధించిన పనులు నెమ్మదిగానే సాగుతున్నాయి.

కాలువల తవ్వకాలు జరిగిన కెల్ల రైల్వేక్రాసింగ్ వద్ద రైల్వేశాఖ నుంచి గతంలో అనుమతులకు సంవత్సరాలు పట్టింది. ఎట్టకేలకు అనుమతులు రావడంతో రైలు వంతెన నిర్మాణం పనులు పూర్తయ్యాయి.

## అంగన్‌వాడి సేవలు సద్వినియోగపరుచు కోవాలి

గరివిడి: ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాలు ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను సద్వినియోగ పరుచు కోవాలని కె.ఎల్.పురం పంచాయితీ ఉపసర్పంచ్ పాండ్రంకి కామేశ్వరరావు కోరారు. గ్రామంలో అంగన్‌వాడి కేంద్రాలు శనివారం సామూహిక సిమంతాలు కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాలు ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, పి.ఎచ్.సి. సూపర్‌వైజర్‌లు, ఎ.ఎన్.ఎమ్‌లు పాల్గొన్నారు. అనంతరం కామేశ్వరరావు తన స్వంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 103 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసారు. దీనికి పాఠశాల హెచ్.ఎమ్. ఎస్.కె.పి.కుమార్, ఉపాధ్యాములు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపాలనకు చరమగీతం పాడండి

### *38 డివిజన్ వైసీపీ అభ్యర్థిని యార్లగడ్డ పద్మజ*



కాకినాడ : రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి పాలనకు కాకినాడ నగర ప్రజలు చరమగీతం పాడాలని వైసీపీ 38 డివిజన్ అభ్యర్థిని యార్లగడ్డ పద్మజ పిలుపునిచ్చారు.

ఆదివారం ఆమె కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు పురస్కరించుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాకినాడ నగరపాలకసంస్థకు ఎన్నికలు నిర్వహించకుండా అవినీతిపాలన సాగిస్తున్న టిడీపీ ప్రజాప్రతినిధులకు ఈ ఎన్నికలు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. నగర అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారనీ పద్మజ ఆరోపించారు. ఈ సందర్భంగా పద్మజ దాట్లవారి వీధి, తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, వైసీపీ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

## స్థిరాస్థి రంగ నియంత్రణ

ఇంతకాలం స్థిరాస్తి రంగంలో మోసాలు ఉంటాయని జడుసుకొని దూరం ఉన్న మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కొనుగోలుదార్లు ఇప్పు డు ధైర్యంగా ముందుకు వస్తారు. పట్టణ ప్రాంతంలో ఉండే నిర్మాణ ప్రాజెక్టులను తనిఖీ చేసుకొని ధైర్యంగా కొనుక్కోవచ్చు. స్థిరాస్తి రంగంలో ఉండే మోసాల వల్ల ఇతర రంగాలలో మదుపు చేసిన వారు, ఇప్పుడు ఈ వైపు దృష్టి సారిస్తారు. దీనివల్ల క్రమంగా రియల్ ఎస్టేట్ రంగం మరింత బలపడుతుంది. స్థిరాస్తి వ్యాపార రంగం పద్ధతి ప్రకారం జరుగడం అన్ని పక్షాలకూ శ్రేయోదాయకం. స్థిరాస్తి రంగ నియంత్రణకు, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కొత్త నిబంధనలు స్థిరాస్తి కొనుగోలుదారులకు మోసాలు జరుగకుండా భరోసా కల్పిస్తున్నయి. ఈ రంగంలో మోసాలను అరికట్టడానికి నిబంధనలను కట్టుదిట్టం చేస్తూనే, వ్యాపారాభివృద్ధికి దోహదపడటం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే స్థిరాస్తి నియంత్రణ చట్టాన్ని (రెరా) తెచ్చిన కేంద్రం వీటిని రాష్ట్రాలు అమలు చేయడానికి మూడు నెలల వ్యవ ధి ఇచ్చింది. అయితే కొన్ని రాష్ట్రాల్లో ఈ చట్టం స్పష్టంగా లేకపోవడంతోపాటు ఇతర్రతా విమర్శలు ఉన్నాయి. కానీ తెలంగాణ రాష్ట్రం అమలులోకి తెచ్చిన కొత్త నిబంధనలు మాత్రం స్పష్టం గా మోసాలకు తావివ్వకుండా ఉన్నాయి. కేంద్ర చట్టంలో కనీస మార్పులు మాత్రమే చేసి వీలైనంత వరకు యథాతథంగా అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం సఫలమైంది. కొత్త నిబంధనల వల్ల స్థిరాస్తి వ్యాపారంలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొంటుంది. స్థిరాస్తి రంగమంటేనే అనేక చిక్కులతో కూడుకున్నదనీ, మోసాలు ఉంటాయని కొనుగోలు దారులు భయపడుతూ ఉంటారు. ఇంతకాలం ఇంటి స్థలం లేదా ఇల్లు కొనుగోలుదారులు మోసపోతే వెంటనే వారిని ఆదుకునే దిక్కులేదు. జీవితకాలమంతా కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో ఎక్కడైనా ఇంటి స్థలం కొని, ఇల్లు కట్టుకొని ప్రశాంతంగా గడుపాలని వృద్ధులు కోరుకుంటారు. తీరా స్థలం కొన్న తరువాత మరొకరు వచ్చి తమదని అనవచ్చు. లేదా అధికారులు వచ్చి అది పార్క్ స్థలమని లేదా మరొకటని అభ్యంతరం చెప్పవచ్చు. ఇట్లా వ్యాపారుల చేతిలో మోసపోయిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. కష్టార్జితం కోల్పోయిన బాధ జీవితాంతం మనసును తొలుస్తూ ఉంటే, వృద్ధాప్యంలో నీడలేని బతుకవుతుంది. ఇటువంటి మోసాలు జరుగకుండా తాజా నిబంధనలను రూపొందించారు. ఇంతకాలం స్థిరాస్తి వ్యాపారులు మోసం చేస్తే శిక్షించడానికి చట్టాలు ఉన్నాయి. అయితే కొనుగోలుదారులు న్యాయం పొందడం దీర్ఘకాల ప్రయాస. ఇప్పుడు మోసాలను ముందుగానే అరికట్టే విధంగా కొత్త నిబంధనలున్నాయి. ఇప్పుడు స్థిరాస్తి వ్యాపారి ముందుగా తమ ప్రాజెక్టును నమోదు చేయించుకొని అన్ని అనుమతులు పొందేవరకు ఒక్క అమ్మకం కూడా జరుపడానికి వీలులేదు. కనీ సం ప్రకటనలు చేయడానికి కూడా వీలులేదు. స్థిరాస్తి వ్యాపార సంస్థ తమ వివరాలన్నిటినీ రెరా వెబ్‌సైట్‌లో పొందుపరుచవలసి ఉంటుంది. ప్లాటు, ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనుక్కోవాలనుకునే వారు సంబంధిత వెబ్‌సైట్‌లో ప్రాజెక్టుకు సం బంధించిన వెబ్‌సైట్ చూసి వివరాలన్నీ తెలుసుకోవచ్చు. నిర్మాణ ప్రాజెక్టు చేపడుతున్న స్థిరాస్తి సంస్థ జాతకం అంతా వెబ్‌సైట్‌లో ఉంటుంది. నిర్మాణ ప్రాజెక్టు ప్రణాళిక, అనుమతులు, భూమి రికార్డు లు, ప్రాజెక్టు ప్రమోటరు ఫొటోలతో సహా వివరాలన్నీ అందులో ఉంటాయి. నిర్మాణ సంస్థ మూడేం డ్ల బ్యాలెన్స్‌షీట్లు, వార్షిక నివేదికలు కూడా ఉంటా యి. దీనివల్ల ఆయా సంస్థలను నమ్మవచ్చా లేదా అనేది కొనుక్కునేవ్యక్తి నిర్ధారించుకుంటా డు. అనుమతి లేకుండా ప్రకటనలు ఇచ్చినా, అమ్మినా నిర్మాణ ప్రాజెక్టులో పది శాతం అపరా ధ రుసుము చెల్లించవలసి ఉంటుంది. అదే నేరం మళ్ళా చేస్తే మూడేండ్లు ఖైదు అనుభవించవలసి వస్తుంది. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు (లేదా కన్సల్టెన్సీ సంస్థలు) కూడా రిజిస్టరు చేయించుకోవలసి ఉంటుంది. మోసాలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దవుతుంది. దీనివల్ల దళారులు తాము అమ్ముతున్న ప్లాట్లు, ఇండ్లు అనుమతులు గలవేనా అనేది నిర్ధారించుకుంటారు. దళారుల మాటలు నమ్మి కొనుక్కునే వారు మోసపోవడం ఉండదు. కొత్త నిబంధనలు అమలులోకి రావడం వల్ల స్థిరాస్తి వ్యాపార రంగం మార్పులకు లోనవుతుంది. ఇందుకు కొంత సమయం పడుతుంది. అంతే తప్ప దీనివల్ల వ్యాపారం దెబ్బతినడమంటూ ఉండదు. రాతోరాత్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అవతారం ఎత్తి, నియమ నిబంధన లు పాటించి తీరాల్సిందే..

## చంద్రబాబు మాట్లాడితే జనం నవ్వుతారు



నంద్యాల: ఏపీ సీఎం చంద్రబాబు ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టుపట్టించారని వైఎస్సార్ సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... చంద్రబాబు లాంటి వాళ్లు రాజకీయాల్లో ఉన్నాళ్లు ప్రజాస్వామ్య మనుగడ కష్టాల్లో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిరాయింపుదారులకు పదవులు ఇచ్చి ప్రజాస్వామ్య విలువలను కాలరాశారని ధ్వజమెత్తారు. ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. చంద్రబాబు వల్లే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదని ఆరోపించారు. వాడుకుని వదిలేయడం చంద్రబాబు నైజమని, నంద్యాల ప్రజలు ఇవన్ని గమనించాలని కోరారు. పిల్లనిచ్చి పెళ్లి చేసిన మామకే వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. ఆ సమయంలో ఎన్టీఆర్ తనయుడు హరికృష్ణకు మంత్రి పదవి ఇచ్చారని.. ఎమ్మెల్యే అయిన మంత్రి పదవి నుంచి హరికృష్ణను తప్పించారని తెలిపారు. మంత్రి అఖిలప్రియకు కూడా అదే పరిస్థితి వస్తుందని అభిప్రాయపడ్డారు. నంద్యాల ఉప ఎన్నికలకు చంద్రబాబే కారణమన్నారు. శోభా నాగిరెడ్డి బతికుంటే భూమా నాగిరెడ్డి పార్టీ మారేవారు కాదని చెప్పారు. వైఎస్ కుటుంబంతో భూమా కుటుంబానికి చాలా అనుబంధం ఉందని, అందుకే ఆ కుటుంబానికి మూడు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ నైతిక విలువలు పెంపొదిస్తుంటే.. చంద్రబాబు కాలరాస్తున్నారని మండిపడ్డారు. శిల్పా చక్రపాణిరెడ్డితో జగన్ రాజీనామా చేయించినా.. 21 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలతో చంద్రబాబు రాజీనామా చేయించలేదని తెలిపారు. విలువల గురించి చంద్రబాబు మాట్లాడితే ప్రజలు నవ్వుకుంటారని ఎద్దేవా చేశారు. జిల్లాకో రకంగా మాట్లాడటం చంద్రబాబుకు అలవాటన్నారు. నంద్యాలలో కండువాలు లేకుండా ప్రచారం చేయాలని బీజేపీ నేతలకు చెబుతున్నారని, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో మాత్రం కండువాలు వేసుకోవాలట అని మేకపాటి అన్నారు. ముస్లింలు, దళితులు, కాపులు, బలహీనవర్గాలు ఎప్పుడూ వైఎస్సార్ సీపీ వెంట ఉంటారని చెప్పారు. నంద్యాలలో శిల్పా మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

## సెమీస్‌లో సాత్విక్, మీనల్



హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కె. సాత్విక్ రెడ్డి, మీనల్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. అమీర్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అండర్15 బాలుర సింగిల్స్ క్వార్టర్స్‌లో పుల్లెల గోపీచంద్ అకాడమీకి చెందిన సాత్విక్ 159, 1510తో జి. అక్షిత్ రెడ్డి (జేఎస్‌కే)పై గెలుపొందాడు. బాలికల విభాగంలో మీనల్ (అపెక్స్) 1513, 1514తో పల్లవి జోషిని ఓడించింది. ఇతర మ్యాచ్‌ల్లో హృతిక షెనాయ్ (వీబీఏ) 1510, 1512తో టి. అనూష రెడ్డిపై, అను సోఫియా 1513, 1511తో శాన్వి (సీఏబీఏ)పై, శ్రేయాన్షి 1512, 1514తో శ్రీ అదితిపై విజయం సాధించారు. బాలుర మ్యాచ్‌ల్లో సుహాస్ 1511, 159తో జనిత్‌పై, విఘ్నేశ్ 1511, 159తో పునీత్ శర్మపై, ధరణ్ (సీఏబీఏ) 1512, 1513తో ఎన్. రాహుల్‌పై నెగ్గారు.

అండర్13 బాలుర క్వార్టర్స్ ఫలితాలు: జి. అక్షిత్ రెడ్డి (జేఎస్‌కే) 1512, 1513తో సీహెచ్ భవ్యాంక్‌పై, బి. అంకిత్ 1511, 1514తో జ్ఞాన దత్తు (సుచిత్ర)పై, సాత్విక్ రెడ్డి 159, 1513తో వర్షిత్ (పీజీబీఏ)పై, ఆర్ణవ్ (జీవీఎస్) 1511, 159తో ప్రణవ్‌పై గెలిచారు.

## హిందూ ముస్లింలు ఐక్యంగా మెలగాలి

కర్నూలు : దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌లోని ధారాభి గ్రామంలో నివసించిన హిందూ, సిక్కు, ముస్లింల స్నేహం, వారి ప్రేమాభిమానాలపై ఆంగ్లంలో రచించిన పుస _కాన్ని, తాను ఉర్దూ భాషలోకి అనువదించిన బట్వారా పుస్తకాన్ని ఈనెల 21న ఆవిష్కరించ నున్నట్లు ఉర్దూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ముజఫర్ అలీ తెలిపారు.

స్థానిక ఉర్దూ వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌లో అల్లర్లు మొదలై హిందూ, సిక్కు మిత్రులపై దాడి జరుగుతున్న సమయంలో ముస్లిం సోదరులు వారికి రక్షణగా నిలిచి స్నేహానికి నిదర్శనంగా నిలిచారని, బాధిత కుటుంబాలను సురక్షితంగా భారతదేశానికి పంపించేందుకు సాహసం చేశా రన్నారు. ద్వేషంతో ఏమి సాధించలేమని.. ఆపదలో హిందూ, సిక్కు మిత్రులకు రక్షణగా నిలిచిన ముస్లిం సోదరుల మాదిరిగానే మన దేశంలోనూ ఐక్యంగా సోదరభావంతో మెలగా లన్నది పుస్తక సందేశమన్నారు.

ఈ పుస్తకాన్ని ఎస్.పి.సింగ్ ఒబెరాయ్ తండ్రి జీవిత చరిత్ర ఆధారంగా పంజాబీ, ఆంగ్లం, హిందీ భాషలో ప్రచురించారని, దీనిని ఉర్దూ భాషలోకి అనువాదం చేసినట్లు చెప్పారు.

ఆవిష్కరణకు హైదరాబాదులోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.అప్పారావు, దుబాయి లోని అపెక్స్ కంపెనీ ఛైర్మన్ ఎస్పీ సింగ్ ఒబెరాయ్, పాటియాలలోని పంజాబీ వర్సిటీ ఆచార్యులు సార్బిజిందర్ సింగ్, పరమవీరసింగ్, పర్బలీస్ సింగ్, ఆచార్య ఏసీ నారాయణ ముఖ్యఅతిథులుగా హాజరవు తారన్నారు.

## రైల్వే పక్షోత్సవాల్లో స్వచ్ఛభారత్

కర్నూలు: రైల్వే పక్షోత్సవాల్లో భాగంగా కర్నూలు రైల్వేస్టేషన్‌లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి దక్షిణ మధ్య రైల్వే మానవ వనరుల విభాగపు అధికారి ఆదిత్యకుమార్ హాజరై, ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి శ్రమదానం చేశారు.

అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. పక్షోత్సవాల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే స్టేషన్లలో ప్రతీ రోజు ఒక్కొక్క కార్య క్రమాన్ని చేపడతామని వెల్లడించారు. ఈ కార్య క్రమంలో స్టేషన్ మేనేజర్ సయ్యద్ మక్బుల్ హుస్సేన్, రైల్వే ఆసుపత్రి వైద్యులు డా.సిద్దిఖ్, మొహిద్దీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### "మగ బుద్ధి"

అందం చూడవయ్యా!
ఆనందించవయ్యా!
చూసేది-చూసేకా!
ఏం-చూడలేదనకయ్యా!
దోచేది-దోచేకా!
ఏం- దాచలేదనకయ్యా!
ఆశక అంతం లేదయ్యా
తృప్తికి మించిన సంతృప్తి లేదయ్యా!
మీ మగ బుద్ధిఇంతేనయ్యా! ...॥అందం॥
ముసుగులో అందం ఉన్నంత వరకూ
ఆశను చూపుతావయ్యా!
ఆ ముసుగు తెరలు-తొలగించేకా!
నిస్సంతృప్తి చెందుతావయ్యా!
స్వర్గ సీమ-సోయగాన్ని
చోరుడువై-చీకటిచేస్తే
అసంతృప్తి కాకా ఇంకేమున్నదయ్యా!
మీ మగ బుద్ధి ఇంతేనయ్యా!
మీ మగ బుద్ధి ఇంతేనయ్యా ... ॥అందం॥
కోనసీమ కొబ్బరి బొండాలు తాగినా!
బొరివంకా బోరు బావినీరు తాగినా!
తాడిపత్రి తాటికల్లు తాగినా!
ఇచ్ఛాపురం ఈతకల్లు తాగినా!
దాహం తీరలేదందువయ్యా!
మైకం లేదందువయ్యా! ...॥అందం॥
మీ మగ బుద్ధి ఇంతేనయ్యా!
అమరావతి-అపురూప శిల్పాలవంటి
సుందరీమణులను చూసినా! ఇంకా!
కొత్త రుచులు- కొత్త రంగులు
కోరుతుందువయ్యా!
విద్యుత్ తీగలు తాకినా!
షాక్ తగలేదందువయ్యా! ...॥అందం॥

రచయిత
యల్: సిద్ధు
సెల్ :7702977293

## పంచాంగం

మాసం : శ్రావణ : తిథి : బ.సప్తమి సా. 05-41
భరణి రా. 02-59 వ.మ. 01-21 ల 02-51

ఆదివారం
21-08-2017

**మేషం** :తరచూ దైవ కార్యాల్లో పాల్గొంటారు. ఆత్మవిశ్వాసంతో సవాళ్ళను ఎదుర్కొంటారు. ఉద్యోగ భద్రత వల్ల భవిష్యత్ పట్ల భరోసా వస్తుంది. రాబోయే ఆదాయానికి తగినట్టుగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. పెద్దలను అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాల కోసం ధనం అధికంగా వెచ్చిస్తారు.

**వృషభం** :బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తుల పట్ల అవసరం. బంధువుల విషయంలో తలదూర్చడం కంటే మీ పనులు మీరు చేసుకోవడం మంచిది. మీ సంతానం మీ మాటను గౌరవిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారు. స్త్రీలకు ప్రకటనలు, స్కీముల పట్ల అవగాహన అవసరం.

**మిధునం** : పాత మిత్రుల కలయికతో గత అనుభవాలు జ్ఞప్తికి వస్తాయి. దీర్ఘకాలంగా కోర్టులో ఉన్న కేసు ఒకటి మీకు ఊరటనిస్తుంది. స్త్రీలు గృహోపకరణాలు కొనుట పట్ల ఆసక్తి చూపుతారు. రాబడికి తగినట్లుగా ఖర్చులు ఉంటాయి. దైవ కార్యాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల కష్టనష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

**కర్కాటకం** : వృత్తుల వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. సాహస ప్రయత్నాలు విరమించండి. పలుకుబడి ఉన్న వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. కుటుంబీకుల కోసం ధన బాగా వ్యయం చేస్తారు. ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు.

**సింహం** : పత్రిక, ప్రింటింగ్ రంగాల వారికి ఓర్పు, అంకితభావంతో శ్రమించాల్సి ఉంటుంది. స్త్రీలకు పనివారతో ఇబ్బందులు తలెత్తుతాయి. మీరు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మిత్రులను కలుసుకుంటారు. చేతివృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. విద్యార్థుల ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచింది.

**కన్య** : ఇంటా బయట అధిక కృషి అనంతరం మంచి ఫలితాలను పొందుతారు. కొబ్బరి, పండ్ల, పూల, చిరు వ్యాపారులకు కలిసిరాగలదు. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. స్త్రీలకు ఆర్జనపట్ల ఆసక్తి, అందుకు అనువైన పరిస్థితులు నెలకొంటాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాలను చేజార్చుకుంటారు.

**తుల** : నూతన టెండర్ల విషయమై ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. స్త్రీలకు ఆరోగ్యకరమైన సంప్రదింపులు జరుపుతారు. సభలు, సమావేశాలలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. అనుకోని ఖర్చులు, ఇతరాత్రా సమస్యల వల్ల మానసిక ప్రశాంతత లోపిస్తుంది.

**వృశ్చికం** : బంధువుల రాకపోకలు అధికమవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాల విషయంలో పునరాలోచన అవసరం. రుణాలు తీరుస్తారు. మీ సంతానం వివాహం, విద్య విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనుపరుస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. పోస్టల్, ఎల్.ఐ.సి ఏజెంట్లకు ఆర్థికంగా బాగుంటుంది.

**ధనుస్సు** : ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. ఉద్యోగస్తులకు పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికంగా ఉంటాయి. దైవ, సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. వస్త్ర, బంగారు, ఫ్యాన్సీ, పచారీ వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి.


**మకరం** :గృహ మార్పులు, మరమ్మతులు అనుకూలిస్తాయి. స్త్రీల, ఆలోచనలు, అభిప్రాయాలకు మంచి స్పందన లభిస్తుంది. హోటల్, తినుబండరాలు, చిరు వ్యాపారులకు అశాజనకం. ప్రింటింగ్ రంగాల వారికి ఒత్తిడి బాగా ఉంటుంది. ప్రతి పనిలోనూ ఎదుటివారి నుంచి విమర్శలు రాకుండా జాగ్రత్త తీసుకోవలసి ఉంటుంది.

**కుంభం** : మీ యత్నాలకు కుటుంబీకుల సహకారం అందుతుంది. ఆస్తి పంపకాలు, భూ వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి, వాహనం విలువైన వస్తువులు ఇతరులకిచ్చే విషయంలో లౌక్యంగా మెలగండి. విద్యార్థులు క్రీడలు, క్విజ్ పోటీల్లో రాణిస్తారు. గృహ నిర్మాణాలలో స్వల్ప అడ్డంకులు, చికాకులు ఎదుర్కొంటారు.

**మీనం** :సత్కాలం ఆసన్నమైంది, మీ ఆలోచనలు, పథకాలు అమలు చేయండి. అనుకున్న పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఉద్యోగస్తులు యూనియన్ కార్యకలాపాల్లో తలమునకలై ఉంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు మంచి స్పందన లభిస్తుంది. వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత అవసరం.

# సాయిబాబా వ్రత గాథ

## సంకీర్తన



కోకిల అను సాధువైన స్త్రీ తన భర్త మహేష్‌తో ఒక నగరంలో నివిసిస్తోంది. పరస్పర ప్రేమానురాగాలతో, అన్యోన్యంగా వారు సంసారం సాగిస్తున్నారు. అయితే మహేష్‌ది దెబ్బలాడు స్వభావం మరియు అతని మాటలతో, భాషలలో సభ్యత అను హద్దులే ఉండేవి కావు. ఇరుగు పొరుగు వాళ్లకు మహేష్ స్వభావం చాలా ఇబ్బందికరంగా ఉండేది. కానీ కోకిల చాలా శాంత స్వభావురాలైన భక్తురాలు. అపారమైన విశ్వాసంతో ఆమె సహృదయంతో... సహనంతో అన్నీ కష్టాలు సహిస్తూ వస్తుండేది. కాలక్రమంగా ఆమె భర్త యొక్క వాపారము దెబ్బతినగా సంసారం సాగడమే కష్టంగా ఉండేది. కాని మహేష్ పొద్దస్తమానం ఇబ్బందులకు గురవుతూ చీటిమాటికి భార్యతో పోట్లాడుతూ ఉండేవాడు. ఒక రోజు మధ్యాహ్నం ఒక సాధువు వారి గృహమునందు నిలిచాడు. ఆ సాధువు కోకిల వదనం చూసి బియ్యం మరియు పప్పు భిక్షం అడుగుతూ సాయిబాబా నిన్ను అనుగ్రహించు గాక అని కోకిలను దీవించాడు. కోకిల చాలా బాధపడుతూ ఈ జీవితంలో తనకు సంతోషనేది రాయబడిలేదంటూ తన విషాద గాథను చెప్పుకుంది.

కోకిల అను సాధువైన స్త్రీ తన భర్త మహేష్‌తో ఒక నగరంలో నివిసిస్తోంది. పరస్పర ప్రేమానురాగాలతో, అన్యోన్యంగా వారు సంసారం సాగిస్తున్నారు. అయితే మహేష్‌ది దెబ్బలాడు స్వభావం మరియు అతని మాటలతో, భాషలలో సభ్యత అను హద్దులే ఉండేవి కావు. ఇరుగు పొరుగు వాళ్లకు మహేష్ స్వభావం చాలా ఇబ్బందికరంగా ఉండేది. కానీ కోకిల చాలా శాంత స్వభావురాలైన భక్తురాలు. అపారమైన విశ్వాసంతో ఆమె సహృదయంతో...

**9 గురువారాల వ్రతం:** ఆ సాధువు ఆమెను సాయిబాబా వ్రతమును 9 గురువారములు ఆచరించమని ఉపదేశించినాడు. వ్రత సమయమునందు పళ్ళు పానీయములు లేక ఒక పూట ఆహారము మాత్రమే భుజించాలని ఆదేశించాడు. సాధ్యమైతే సాయిబాబా మందిరానికి వెళ్లి ప్రార్థించాలని లేదా గృహంలో సాయి పూజను ఆచరించి 9 గురువారాలు తన శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా నిర్దేశించబడిన నియమాలను అనుసరించి బీదలకు అన్నదానం గావించి 5 మందికి లేక 11 మందికి శ్రీ సాయి వ్రత పుస్తకాలను ఉచితంగా వితరణ గావించాలి. ఈ వ్రత ఆచరణ చాల మహత్వపూరితమైనది. మరియు కలియుగానికి చాల యుక్తమైనది. ఈ వ్రతము భక్తుని కోర్కెలను తీర్చును. కానీ భక్తునికి సాయినాథునిపై ప్రగాఢ విశ్వాసం మరియు భక్తి కలిగి ఉండాలి. ఏ భక్తుడైతే ఈ వ్రతమును నియమానుసారంగా భక్తిశ్రద్ధలతో ఆచరించునో అతని సమస్త కోరికలు ప్రార్థనలు సాఫల్యం గావించును అని సాధువు కోకిలకు చెప్పెను. కోకిల గూడా ఈ నవ గురువార వ్రతమును ఆచరించాలన్న దీక్షను గైకొని నిర్దేశించబడిన సమయానుసారంగా బీద సాదలకు అన్నదానం గావించి సాయివ్రత పుస్తకములను తొమ్మిదవ గురువారం ఉచితంగా వితరణ గావించి వ్రత దీక్షను పూర్తిగావించినది. అలా కొన్ని రోజులు గడిచిన పిమ్మట ఆమె కష్టాలన్నీ మాయమైనవి. గృహంలో సుఖ శాంతి వెలిసినది. మహేష్ యొక్క కలహ స్వభావం శాశ్వతంగా అంతరించినది. అతని వ్యాపారం సజవుగా కొనసాగింది.

## 4 నుంచి అమ్మవారి పవిత్రోత్సవాలు

తిరుపతి : తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలు వచ్చే నెల 4నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నామని తితిదే తిరుపతి జేఈవో పోల భాస్కర్ తెలిపారు.తితిదే పరిపాలనా భవనంలో తితిదే న్యాయాధికారి రమణనాయుడు, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో మునిరత్నం రెడ్డితో కలిసి ఆయన పవిత్రోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మూడురోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయంలో ఏడాది పొడవునా పలు క్రతువుల్లో తెలిసీతెలియక జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు నాలుగో తేదీన పవిత్ర ప్రతిష్ట, అయిదున పవిత్ర సమర్పణ, ఆరో తేదీన జరిగే పూర్ణాహుతితో కార్యక్రమం ముగిస్తుందన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు రూ.750 చెల్లిస్తే ఇద్దరిని అనుమతిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సెప్టెంబరు మూడోతేదీ నుంచి ఆరోతేదీ వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దుచేస్తున్నట్లు చెప్పారు.

## వీఆర్వోలు రెవిన్యూ రికార్డులపై అవగాహన పెంచుకోవాలి

వేపాడ: గ్రామ రెవిన్యూ కార్యదర్శులు రెవిన్యూ రికార్డులపై అవగాహన కలిగిఉండాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, వేపాడ పిటీషన్ జమాబంది అధికారి సాల్మన్‌రాజు అన్నారు.

వేపాడ తహశీల్దార్ కార్యాలయంలో పిటీషన్ జమాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసిన ఆయన విశాఖపట్నంలో రెవిన్యూ రికార్డులు ట్యాంపరింగ్ జరిగినందున ఇక్కడి వీఆర్వోలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వీఆర్వోలంతా రెవిన్యూలో ఎన్నిరకాల రికార్డులు ఉంటాయో తెలుసుకోవాలన్నారు. వాటిపై పూర్తి స్థాయి అవగాహన పొందాలన్నారు. అలా ఉన్ననాడే అక్రమాలు జరిగే అవకాశం ఉండదన్నారు. అనంతరం జమాబంది పిటీషన్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 5,474 నీరు - ప్రగతి పనులు మంజూరు

### జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న



చిత్తూరు : జిల్లాలో నీరు-ప్రగతి పనులు వేగవంతం చేయాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. రాత్రి జిల్లా సచివాలయంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే మంజూరు చేసిన నీరు-ప్రగతి పనులు అనుకున్నంత వేగంగా పూర్తి చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మదనపల్లె ఈఈ పరిధిలో 910 పనులు మంజూరు చేస్తే 320 పనులు పూర్తి చేశారని, తిరుపతి ఈఈ పరిధిలో 185 పనులు, చిత్తూరు ఈఈ పరిధిలో 130 పనులు పూర్తి చేశారని, ఇలా అయితే లక్ష్యాలు ఎలా చేరుకోగలమని ప్రశ్నించారు. నత్తనడకన పనులు సాగుతున్న పలమనేరు, శ్రీకాళహస్తి డీఈలను వివరణ కోరారు. నీరు-ప్రగతి పనులపై మండలాల వారిగా ఏఈ, ఈఈ, డీఈలతో సమీక్ష నిర్వహించారు. నీరు-ప్రగతి కింద తాజాగా మరో 5,474 పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ పనులకు సంబంధించి తీర్మానాలను వచ్చే శనివారం లోపు తీసుకోవాలన్నారు. తీర్మానం చేసిన పనులనే చేపట్టాలని ఆదేశించారు. తీర్మానాల్లో లేని పనులు చేస్తే బిల్లులు చెల్లించడం జరగదని, సదరు పనులను రద్దు చేస్తామని హెచ్చరించారు. పంటసంజీవని నీటి కుంటల తవ్వకంలో శ్రీకాళహస్తి, నగరి, తిరుపతి, చంద్రగిరి ఏపీడీలు భాగా పనిచేస్తున్నారంటూ అభినందించారు. ఇదే సమయంలో మదనపల్లె, చిత్తూరు, ములకలచెరువు, సదుం ఏపీడీల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు లోతులో ఉన్నాయి. ఇక్కడే పంటకుంటలు అవసరం ఎక్కువ. ఈ విషయాన్ని రైతులకు వివరించి ఎక్కువ సంఖ్యలో కుంటలు తవ్వించాలన్నారు. జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణాన్ని ఉద్యాన, డ్వామా, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేసి పెంచాలన్నారు. మేలు రకాలైన వంగడాలను తెప్పించి రైతులకు పంపిణీ చేయాలన్నారు. అంతరపంటలను ప్రోత్సహించాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, జీపీఎస్‌తో ఫొటోతో సహా కైజాలా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామాలను వ్యర్థరహితం చేయాలన్నారు. సీసీరోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఎన్టీఆర్ హౌసింగ్, మొక్కల పెంపకంపై సమీక్షించారు.

రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని జిల్లా పాలనాధికారి చెప్పారు. రోజుకు సగటుగా ముగ్గురు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటలలోపు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సంకల్పం గ్రామసభల్లో రోడ్డు ప్రమాదాల నివారణలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించాలని ఆదేశించారు. పోలీసు అధికారులతో కలిసి జిల్లా అధికార యంత్రాంగం రోడ్డు ప్రమాదాల నివారణకు ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. డీపీవో, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, పీఆర్ ఎస్‌ఈ, జిల్లా పరిషత్తు సీఈవోలు శ్రద్ధపెట్టి గ్రామపంచాయతీల పరిధిలోని జాతీయ రహదారుల కూడలను ప్రత్యేకంగా తీర్చిదిద్దాలన్నారు. రోడ్ హంప్స్ పెట్టాలని, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జేసీ-2 చంద్రమౌళి, శిక్షణ కలెక్టరు కీర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘరానా ఏటీఎం దొంగ అరెస్ట్ రూ. 1.8 లక్షలు స్వాధీనం

### ఈస్ట్ డీఎస్పీ మునిరామయ్య వెల్లడి



తిరుపతి : నగరంలోని ఏటీఎం వద్ద వృద్ధులను, నిరక్షరాస్యులను మోసగించి వారి ఏటీఎంలను చోరీచేసి నగదును కాజేసే ఘరానా దొంగను ఈస్ట్ సీఐ రామ్‌కిషోర్, ఎస్ఐ ఈశ్వరయ్య బృందం స్థానిక ఎయిర్‌బైపాస్ రోడ్డులోని ఏటీఎం వద్ద అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ మునిరామయ్య తెలిపారు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం, కోలారు జిల్లా, మాలూరుకు చెందిన వి.తిమ్మరాయప్ప(32) కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తిచేశాడు.చెడు అలవాట్లకు బానిసై సులభంగా నగదు సంపాదించేందుకు ఏటీఎంలను కేంద్రాలుగా మార్చుకున్నాడు. ఏటీఎం సెంటర్‌లకు వచ్చే వృద్ధులు, నిరక్షరాస్యులను మోసగించి ఏటీఎంపై స్క్రీన్‌పై వేలుఉంచి కొద్దిసేపు ఏటీఎం స్క్రీన్ పనిచేయకుండా చేసేవాడు. అంతకు ముందే వారు పిన్‌నెంబరు ఎంటర్‌చేసి ఉండటంతో అక్కడకు చేరుకుని వారిని యాత్రికుల ముసుగులో ఏమార్చి కొంతసేపటికి వారిని బయటకు పంపి ఏటీఎం స్క్రీన్ ఓపెన్ కాగానే నగదు డ్రా చేసుకుని పరారయ్యేవాడు. ఇలా అతడు తిరుపతి నగరంలో 2016 మేలో ఎస్‌బీఐ ఏటీఎంలో ఓ వ్యక్తిని మోసగించి రూ.2.8లక్షలు, అదే ఏడాది ఆగస్టులో రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఏటీఎంలో రూ.59వేలు, 2017 జూన్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వద్ద మరమ్మతుల్లో ఉన్న ఇండియన్ బ్యాంక్ ఏటీఎం నుంచి రూ.10వేలు, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అజంతా లాడ్జి కింద ఉన్న ఏటీఎంలో ఓ వ్యక్తిని మోసగించి రూ.15వేలు మొత్తం రూ.4.04లక్షలు చోరీ చేశాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు కేసులను నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.1.8లక్షల నగదును, మూడు ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అర్బన్ జిల్లా పరిధిలో ఏటీఎం మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా ప్రజలు వూరికి వెళ్లే సమయంలో ఎల్‌హెచ్‌ఎం ఎస్ ఆప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### ఆంధ్రా అగ్రికల్చరల్ జర్నల్ ఎడిటర్‌గా శ్రీనివాసరావు

బాపట్ల : ఆంధ్రా అగ్రికల్చరల్ జర్నల్ ఎడిటర్‌గా బాపట్ల వ్యవసాయ కళాశాల సాంఖ్యక శాస్త్ర విభాగాధిపతి, ఆచార్య డాక్టర్ వట్లూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో బాపట్ల ఏజీ కళాశాలలో 1956 నుంచి ఈ జర్నల్‌ను ప్రచురిస్తున్నారు. 2017-2019 సంవత్సరానికి కొత్త బోర్డును ఎన్నుకొన్నారు. జర్నల్ ఎడిటర్‌గా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

## పాదయాత్ర చేసి తీరుతా


ముద్రగడ

కిర్లంపూడి : ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఎన్ని అవాంతరాలు కల్పించినా పాదయాత్ర చేసి తీరుతానని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. పాదయాత్రను ఎన్నిరోజులు అడ్డుకున్నా మరుసటి రోజునే మళ్లీ ప్రారంభిస్తానని, ఒకవేళ అరెస్టు చేసి జైలుకు తరలిస్తే జైలులోనే నిరసన దీక్షను కొనసాగిస్తానని ఆయన అన్నారు. కిర్లంపూడిలో ఐకాస నాయకులు, కాపు సంఘాల నాయకులతో కలిసి ముద్రగడ పాదయాత్రకు బయలుదేరారు. ఇంటి గేటు వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీనికి నిరసనగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అక్కడే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. వివిధ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాపు సంఘాల నాయకులు కిర్లంపూడి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ తనను కలిసేందుకు ఇతర జిల్లాల నుంచి కిర్లంపూడి వచ్చే వారిని పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను బయటకు వెళ్లనివ్వకుండా ఎవరూ తనను కలవకుండా వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఎప్పటికైనా కాపులకు రిజర్వేషన్లు కల్పించి తీరాల్సిందేనన్నారు.

ఒకవేళ ఈ ప్రభుత్వానికి కాపులకు రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం లేకపోతే తామే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు. ఈ సందర్భంగా కిర్లంపూడిలో ముద్రగడను సినీ దర్శకుడు వి.వి.వినాయక్ సోదరుడు సురేంద్ర కుమార్, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తానేటి అనిత, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కాపు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యాలయాలను మద్యాలయాలుగా మారుస్తున్న మందుబాబులు

రావికమతం : మండలంలో మందబాబులు, ఆకతాయిలు విద్యాలయాలను మద్యాలయాలుగా మార్చేస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా సరస్వతీ నిలయాలు కాస్త బార్లుగా మారుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. సరైన పర్యవేక్షణ, గస్తీ లేకపోవడంతో రావికమతం జెడ్పీ హైస్కూల్, కొత్తకోట జైఅరుణ డిగ్రీ కళాశాలల ఆవరణను మందుబాబులు ధ్వంసం చేస్తున్నారన్నారు. మద్యం సేవించి తాగిన మత్తులో బెంచీలు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారు. సీసాలను పగలకొట్టడతో గాజు పెంకులు చెల్లాచెదురుగా పడుతుండటంతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రావికమతం హైస్కూల్‌లో మందుబాబులు పూటుగా మద్యం సేవించి 36 బెంచీలు, తలుపులను ధ్వంసం చేశారు. జిల్లా అధికారులు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికి ఆకతాయిల ఆగడాలు తగ్గలేదు. కొత్తకోట కోఆపరేటివ్ సొసైటీ భవనాల్లో నిర్వహిస్తున్న జైఅరుణ డిగ్రీ కళాశాల మేడ బారును తలపిస్తోంది. పవిత్రమైన సరస్వతీ నిలయాలు ఇటువంటి పనులు చేయకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రాత్రివేళా నిఘా ఉంచి అకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలి

నర్సీపట్నం : అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని కసిరెడ్డిపాలెం అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి కోరారు. మారుమూల గ్రామంలో కావడంతో గ్రామంలోని వార్డుమెంబరు, పెద్దలను పిలిపించి ప్రభుత్వఆదేశాల మేరకు అన్నప్రసనరణ, సీమంతాలు జరిపించారు. గ్రామంలో ఉన్న వారు కూడా ఉత్సాహంగా పాల్గని కూటవేటు దూరంలోని ఐసిడిఎస్ ఏసిడిపిఒ జివి.రమణి, సదరు సెక్టారు సూపర్‌వైజర్ పుష్పలత అందుబాటులో ఉన్నప్పటికీ సదరు కార్యక్రమంపై హాజరు కాకపోవడంపై కసిరెడ్డిపాలెం గ్రామస్థులు అసహనంవ్యక్తం చేశారు.

## విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

### తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

శ్రీవిద్యానికేతన్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థి విద్యపై ఏకాగ్రత చూపి అత్యున్నత ఫలితాలను సాధించాలని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అన్నారు. శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల సముదాయంలో నూతన విద్యార్థుల పరిచయ వేదిక (ఫ్రెషర్స్‌డే)ఉత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య జీవితాన్ని మార్చివేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మానసిక, శారీరక, దేహధారుఢ్యాన్ని పెంపొందించే క్రీడలపై మొగ్గు చూపాలన్నారు. శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల సీఈవో మంచు విష్ణు మాట్లాడుతూ.. విద్యాసంస్థలో ఎల్‌కేజీతో అడుగుపెట్టే ప్రతి విద్యార్థి పట్టాలు పుచ్చుకుని, అత్యున్నత ఉద్యోగాలతో స్థిరపడుతుంటే తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు విద్యాసంస్థల అధినేత డాక్టర్ మంచు మోహన్‌బాబు తితిదే ఈవోను సత్కరించారు. భారీ వర్షం వల్ల పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది. విద్యాసంస్థల ప్రత్యేక అధికారి గోపాలరావు, డైరెక్టరు భగవానులు, సీఏవో తులసినాయుడు, ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణమాచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సహస్ర దీపాలంకరణలో యుగయుగాల దేవుడు

మంగళగిరి : మంగళగిరి ఆలయం శ్రీలక్ష్మీనృసింహస్వామి నామస్మరణతో మార్మోగింది. రాత్రి యుగయుగాల దేవుడు శ్రీపానకాల శ్రీలక్ష్మీనృసింహస్వామికి సహస్ర దీపాలంకరణ సేవ అత్యంత వైభవంగా జరిగింది. ప్రత్యేక వూయలపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీలక్ష్మీనృసింహస్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మండపంలో సహస్రదీపాలంకరణతో వూంజల్ సేవ నిర్వహించారు.

# కడపలో పరివర్తనకు నాంది


### ఎస్పీ, కలెక్టర్లను సన్మానించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి




కడప : అనుకున్న లక్ష్యం మూడు వేలు.. కానీ అంతకన్నా ఎక్కువ మంది వచ్చారు. వారి జీవితాల్లో కొత్త వెలుగు చూడాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఎంతో కష్టపడింది. వారు పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కింది. ఇసుక వేస్తే రాలనంతగా ప్రజలు జిల్లా అధికారులు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు భారీ ఎత్తున హాజరయ్యారు. మట్కా నిర్వాహకుల్లో మార్పు తీసుకొచ్చేందుకు జిల్లా పోలీసు అధికారి బాబూజీ పరివర్తన అనే వినూత్న కార్యక్రమానికి జడ్పీ సమావేశ మందిరంలో నాంది పలికారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో వచ్చారు. జడ్పీ సమావేశ మందిరం మొత్తం నిండిపోయింది. మట్కా వల్ల ఇకపై ఏ ఒక్కరి జీవితాలు నాశనం కాకుడదనే ఉద్దేశంతో గతంలో ఏ ఎస్పీ చేయని విధంగా ఇప్పుడున్న ఎస్పీ బాబూజీ ముందడుగు వేశారు. రాష్ట్రంలో ఎవరూ చేయని విధంగా ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల రోజుల నుంచి ఈ కార్యక్రమం గురించి కసరత్తు చేశారు. ఎంతో మందితో చర్చించారు. అందరితో చర్చించిన తరువాత పరివర్తన అని పేరిట రంగంలోకి దిగారు. ఎస్పీతో పాటు జిల్లా కలెక్టరు బాబూరావునాయుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌లు కూడా సహాయ సహకరాలు అందించారు. దీంతో కార్యక్రమంలో విజయవంతమైంది. నిజంగా జిల్లాలో ఇంత మంది మట్కా నిర్వాహకులు, మట్కా మానేసిన వారు ఉన్నారా..? అని అనుమానం వేస్తోంది. మట్కా ఇంత మందిపై ప్రభావం చూపుతోందా అనిపిస్తోంది. కార్యక్రమానికి వచ్చిన వారందరి కోసం భోజనం ఏర్పాటు చేశారు. మట్కా వల్ల జీవితాలు ఎలా నాశనమవుతాయో వీడియో ద్వారా చూపించారు. ఆ వీడియో అందరినీ ఆకట్టుకుంది. అలానే మట్కా బాధితులు చెప్పిన మాటలు అందరి హృదయాలను ద్రవింపజేశాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చి వారందరికీ జడ్పీ సమావేశ మందిరంలోనే భోజనాలు తయారు చేసి అందరికీ వడ్డించారు. తిరిగి వారిని బస్సుల్లో వారి వారి వూళ్లకు పంపించారు. చాలా మంది ఈ కార్యక్రమం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నిజంగా మట్కా నిర్వాహకుల్లో మార్పు వస్తే ముందుగా సంతోషించే వారిలో తొలుత జిల్లా ఎస్పీ బాబూజీ, ఆ తరువాత మిగిలిన అధికారులు. దీని ఫలితం త్వరలో తెలుస్తుంది. విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో పరివర్తన కార్యక్రమాన్ని అమలు పరుస్తారు.


# ఉప ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు

### జిల్లా ఎన్నికల అధికారి సత్యనారాయణ



నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ఉప ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితోపాటు ఇతర అధికారులను విధుల్లో నియమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌తో కలసి సత్యనారాయణ మాట్లాడారు. ఈవీఎం బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా నంద్యాల ఉప ఎన్నికల్లోనే వీవీ ప్యాడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటరు తాము ఎవరికి ఓటు వేశామో తెలుసుకునే విధంగా ఇందులో ఏర్పాటు ఉంటుందన్నారు. ఈ విధానంపై ప్రజల్లో అపోహలు ఉన్నాయని, అవి నిజం కాదన్నారు. కేవలం ఓటు వేసిన ఓటరుకు మాత్రమే తెలుస్తుందని ఇతరులకు ఎవరికీ తెలియదన్నారు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాల్లో కేవలం 40 మాత్రమే సాధారణ కేంద్రాలని, మిగతా 215 సున్నిత, సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. 14 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం వరకు రూ.24.75 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని, శనివారం మరో రూ.40 లక్షలు పట్టుబడిందన్నారు. 1,405 గ్రాముల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. డబ్బు వినియోగం జరగకుండా ఎన్నికల వ్యయ గణాంక పరిశీలకులను నియమించామన్నారు. నియోజకవర్గాన్ని 20 సెక్టార్లుగా విభజించి ఒక్కొక్క సెక్టారుకు జిల్లా స్థాయి అధికారిని నియమించామన్నారు. 22వ తేదీ నాటికే సిబ్బందికి పోలింగ్ సామగ్రిని ఇచ్చి బస్సుల్లో పంపనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేశామని, పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు, వసతులు చేస్తున్నట్లు తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డునుగాని, ఓటరు స్లిప్పుగాని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని ఆయన వివరించారు.

# చిగుళ్ల వ్యాధి.. లక్షణాలు.. చికిత్స




మన దేశంలోని చాలామంది లో చిగుళ్ల జబ్బులతో బాధపడే వారు ఎక్కువ. ఈ చిగుళ్ల వ్యా ధులు ముదిరిపోయి, సమస్య పంటి ఎముక వరకూ వ్యాపిస్తే గానీ సాధారణంగా నొప్పి ఉండదు. అందుకే చిగుళ్ల వ్యాధులను గుర్తించడం అంత తేలిగ్గా సాధ్యంకాదు. అవగాహన కూడా తక్కువే. కొన్ని ప్రాథమిక లక్షణాలు ఉన్నప్పుడు చిగుళ్ల వ్యాధి ఉన్నట్లు గుర్తించి దాన్ని సరిచేసుకోవాలి. చిగు ళ్ల వ్యాధిలో రెండు దశలు ఉంటాయి అవి.

**జింజివైటిస్:**

ఈ దశలో చిగుళ్ల జబ్బు తీవ్రత అంతగా ఉండదు. చిగుళ్లు ఎర్రగా వాచి ఉంటాయి. ముట్టుకుంటే జివ్వుమంటాయి. బ్రష్ చేసు కున్నప్పుడు రక్తస్రావం కావచ్చు. అయితే మన దేశంలో సాధారణంగా ఏదో కారణంవల్లగానీ, బ్రష్ చేసుకునే సమయంలో ప్రతి ఐదుగురిల ముగ్గురికి రక్తస్రావం ఉంటుంది. పైగా జింజి వైటిస్‌ల నొప్పి ఉండదు. ఈ కారణాలవల్ల చాలా సందర్భాల్లో ఏళ్ల తరబడి ఈ వ్యాధిని గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. అందువల్ల సాధారణంగా దంతవైద్యులను కలిసినప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది.

**పెరియోడాంటైటిస్:**

ఈ దశలో ఇన్ఫెక్షన్ తీవ్రత ఎక్కువగా ఉండి చిగుళ్లలో పుండ్లు ఏర్పడటం, దంతాలు దూరంగా జరిగిపోవడం, దంతాల మధ్య సందులు పెరగడం జరుగుతాయి. దీంతో శాశ్వత దంతాలు వదులుకావడం, ఊడిపో వడం కూడా జరుగవచ్చు. దంతం ఎముక వరకు వ్యాధి పాకడం వల్ల జింజివైటిస్ అన్న చిన్న సమస్య పెరియోడాంటైటిస్ దశకు చేరుకుంటుంది. కొద్దిపాటి ముందుజాగ్రత్త లతో జింజివైటిస్ దశ, పెరియోడాంటైటిస్ దశలోకి మారకుండా నివారించవచ్చు.

**వ్యాధిని గుర్తించడం (డయాగ్నోజ్) ఇలా:**

**నోటి దుర్వాసన..**

నోటి దుర్వాసన సమస్యను వైద్య పరిభాషల హెలిటోసిస్ అంటారు. దాదాపు 80 శాతానికిపైగా చిగుళ్ల వ్యాధి వల్లనే నటి దుర్వాసన వస్తుంటుంది. కేవలం 20శాతం మందిలో మాత్రమే ఇది అసిడిటీ, సైనసైటిస్, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌వల్ల కావచ్చు. ఇది ఒక సాంఘిక సమస్య. సాధారణంగా దీనివల్ల కుటుంబ సభ్యులే ఎక్కువగా ఇబ్బందిపడ తారు. ఈ సమస్య కనిపించినప్పుడు చిగుళ్ల వ్యాధి ఉందేమనని అనుమానించి తప్పని సరిగా దంతవైద్యులను సంప్రదించాలి. పళ్లు వదులుకావడం అన్న బాహ్య లక్షణంతో, ఒక్కోసారి పళ్లు ఊడిపోవడంతో, ఎక్స్‌రే పరీక్షతో చిగుళ్లపై తీవ్రత ఏ మేరకు ఉందో గుర్తించవచ్చు.

**లక్షణాలు:**

సాధారణంగా చిగుళ్ల వ్యాధులను ఈ కింది లక్షణాలతో గుర్తించవచ్చు.

బ్రష్ చేసినప్పుడు, ఏదైనా గట్టి వస్తువును కొరికినప్పుడు చిగుళ్ల నంచి రక్తం కారడం. నోటిలో ఎక్కువగా లాలాజలం ఊరుతున్నట్లు అనిపించడం. చిగుళ్లు క్రమంగా తగ్గిపోతున్న ట్లుగా అనిపిస్తూ, అద్దంలో చూసుకున్నప్పుడు క్రమంగా దంతాలపై నుంచి చిగురు కిందికి దిగుతున్నట్లుగా అనిపిస్తుంది. చిగుళ్లపై బుడిపెల్లా వచ్చి, అక్కడ చీము పట్టడం. నోటి దుర్వాసన వస్తుండటం.

పళ్లమధ్య సందులు రావడం, దాంతో పంటి మధ్య దూరం పెరిగి తిన్న ఆహార పదార్థాలు అక్కడ ఇరుక్కుపోవడం, అందుకే తిన్న తర్వా తప్రతిసారీ పళ్ల మధ్య సందుల్లో ఆహార పదార్థాలు చేరుతున్నాయనే అంశాన్ని గుర్తిస్తే తప్పనిసరిగా దంతవైత్యులతో పరీక్షలు చేయించుకోవడం అవసరం.

**చికిత్సలు:**

**క్యూరటాజ్...** చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అన్న ప్రాథమిక దశలో ఉంటే క్యూరటాజ్ అనే చికిత్స అవసరమవుతుంది.

**ఫ్లాప్ చికిత్స...**

చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అనే దశను దాటి పెరియోడాంటైటిస్ అనే దశకు చేరితే దానికి ఫ్లాప్ చికిత్స అవసరమవుతుంది.

**బోన్ గ్రాఫ్టింగ్...**

చిగుళ్ల వ్యాధి వల్ల పంటి ఎముక బలహీనమైపోతే దాన్ని దృఢపరచడానికి బ్రోన్ గ్రాఫ్టింగ్ అనే చికిత్స చేయాల్సి ఉంటుంది.

**నివారణ ఇలా...**

ఈ సమస్యలన్నింటినీ నివారించడానికి రోజు రెండుసార్లు ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్టుతో బ్రష్ చేసుకోవాలి. పళ్ల మధ్యలో బ్రష్ చేరలేని చోట ఉండే పాచిని తొలగించడానికి ఫ్లాసింగ్ (దారం వంటి దానితో పళ్ల మధ్యన ఉండే ప్రాంతంలో శుభ్ర చేయడం) చేసుకోవాలి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు, పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి.

నోటికి అతుక్కుపోయే ఆహారాలు, శ్నాక్స్‌ను తక్కువగా తీసుకోవాలి. తందాలకు బలం చేకూర్చే సమతుల పోషకాహారం తీసుకోవాలి. సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను వాడే అలవాటును పూర్తిగా మానేయాలి. పళ్లను శుభ్రం చేయడం అన్నది కేవలం బ్రషింగ్‌వల్ల మాత్రమే సాధ్యంకాదు. అందుకే రోజూ రెండు సార్లు బ్రష్ చేసినప్పటికి, రోజుకు కనీసం ఒకసారి మౌత్‌వాష్‌తో శుభ్రం చేసుకుంటే నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదల అదుపులో ఉంటుంది. టూత్‌బ్రష్ అన్నది మెకానికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడితే, మౌత్‌వాష్ అన్నది కెమికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడుతుంది.

డెంటిస్ట్ సూచించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి ఆర్నెల్లకు ఓసారి ఇంటిలోని కుటుంబ సభ్యులంతా స్కేలింగ్ ప్రక్రియ ద్వారా శుభ్రం చేయించుకోవడం అవసరం. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్‌ఎఫెక్ట్స్) ఉండవు. పళ్లు అరిగిపోతాయన్నది, దంతాలు వదులైపోతాయ న్నది, పళ్ల మధ్య సందులు వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే.

**గుర్తుంచుకోవాల్సిన అంశం:**


చిగుళ్ల వ్యాధులు వచ్చినవారిని పరిశీలిస్తే చాలామట్టుకు కుటుంబ సభ్యులలో వంశపారంపర్యంగా ఈ వ్యాధి కనిపించే అవకాశాలు ఎక్కువ. కాబట్టి పళ్లు వదులై పడిపోయిన కుటుంబ చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) ఉన్నవారు తప్పనిసరిగా దంతవైద్యు డిని సంప్రదించాలి. అంతేకాదు.. చిన్న వయ సులోనే ఎవరికైనా పళ్లు ఊడిపోతే వారి పిల్లలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు:**

ఐదేళ్లుగా ఎప్పుడూ దంతవైద్యుడిని కలిసి ఏ రకమైన దంత వైద్య చికిత్సను తీసుకోని వారిలో చిగుళ్ల వ్యాధులు ఉండే అవకాశం చాలా ఎక్కువ. కాబట్టి మీరు ఈకోవలోకి వచ్చేవారైతే తప్పనిసరిగా దంతవైద్యుడిని కలవాలి. కేవలం దంత సంబంధమైన సమస్యలు వచ్చినప్పుడే కాకుండా ప్రతి ఆర్నెల్లకు ఓ మారు విధిగా దంతవైద్యుడితో పళ్ల పరీక్షలు చేయించుకోవాలి. ఇంట్లోని కుటుంబ సభ్యులంతా ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించాలి.

**బ్రషింగ్‌లో జాగ్రత్తలు:**

బ్రష్ చేసుకునేందుకు మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌నే వాడండి. కిందివరసలో చిగుళ్లూ, పళ్లూ కలిసే చోటు వరకు నిలువుగా బ్రష్ చేసుకోండి. చాలా మృదువుగా బ్రష్ చేసుకోండి. రఫ్‌గా బ్రష్ చేసుకుంటే అది మీ చిగుళ్లకు హాని చేకూర్చవచ్చు. అలాంటప్పుడు అవి త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. చేత్తో చిగుళ్లపై మృదువుగా మసాజ్ చేసినట్లు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది.






# కేశాలకు కావాలి రక్షణ




జాలువారే అందమైన, దట్టమైన జుట్టు చూసేవారిని వెంటనే ఆకర్షిస్తుంది. వారి అందాన్ని పెంచి, వారిని సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా మార్చేస్తుంది. వెన్నల కాంతులు విరబూసే కురులు మరింత నిగనిగలాడాలంటే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి మెరుసే కురుల కాంతుల కోసం అందంగా ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో చూద్దాం.....

వారంలో రెండు సార్లు తలకు నూనె రాసి, తల మాడు మీద బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల కురులు బాగా పెరగడానికి సహాయ పడుతుంది. జుట్టు సాధారణంగా ఉన్నట్లైతే మైల్డ్ షాంపూ, లైట్ కండీషనర్ ఉపయోగించండి. అయినప్పటికీ కురులకు హాని జరుగుతుంటే గోరువెచ్చని నూనెతో మసాజ్ చేయవచ్చు.

**షాంపూని పూర్తిగా ఉపయోగించాలి:**

హై ఆల్కహాల్ ప్రోడక్ట్స్, బ్లో డ్రయింగ్‌లకు దూరంగా ఉండాలి. తలకు షాంపూచేసిన తర్వాత షాంపూను నీళ్లతో పూర్తిగా తొలగించాలి. కండీషనింగ్ సమయంలో వెంట్రుకల మూలాల్లో లైట్ కండీషనర్ ను ఉపయోగించాలి. అదేవిధంగా తీసుకొనే ఆహారంలో కొవ్వు పదార్థాలు, నెయ్యి, నూనె పదార్థాలను వీలైనంత వరకూ తగ్గించండి. బాగా నీళ్ళు తాగి ఒత్తిడికి దూరంగా ఉండాలి.

**జెంటర్ హెయిరింగ్ సర్ఫింగ్ మాస్క్:**

జుట్టు సన్నగా పల్చగా ఉంటే జెంటర్ హెయిరింగ్ నర్ఫింగ్ మాస్క్ ఉపయోగించండి. ఇది వెంట్రుకలను దట్టంగా ఉండేలా చేస్తుంది. తగినంత తేమను అందిస్తుంది. వనమూలికలు (హెర్బల్స్)ను ఉపయోగించి తయారు చేసిన షాంపూ, గోరింటాకు ఆధారిత కండీషనర్‌లను కూడా వాడవచ్చు. అప్పుడు కురులు దట్టంగా కనిపిస్తాయి. నిగనిగలా డుతాయి.

**జుట్టుకు సహజరంగునే వాడండి:**

రంగు వేసుకొనే జుట్టుకు ప్రత్యేక శ్రద్ధ చాలా అవసరం. వారంలో లేదా 15 రోజులకు ఒకసారి వేడి నీళ్లతో మసాజ్ చేసి నరిషింగ్ ప్యాక్ వేసుకుంటే ఎంతో లాభదాయకంగా ఉంటుంది. దాంతో వెంట్రుకలకు పోషణ లభిస్తుంది. వెంట్రుకలు కూడా జిడ్డుగా మారవు. కురులకు కలర్ చేస్తే యు నీ ఫిల్టర్ ఉన్న కేర్ షాంపూను ఉపయోగించడం మంచిది. ఇది కురులకు కండిషనింగ్ ఇస్తుంది. ఇది ఎండ నుంచి రక్షించడం మాత్రమే కాదు, కేశాలకు కలర్ నిలిచి ఉండేలా చేస్తుంది.

**ఎక్కువ వేడి నీరు వద్దు:**

కురులను శుభ్ర పరచడానికి సాధారణ నీళ్ళతో ఉపయోగించాలి. ఎక్కువ వేడి వున్న నీళ్ళతో కురులను శుభ్ర పరిస్తే జుట్టులో ఉన్న నేచురల్ ఆయిల్ వెళ్లిపోతుంది. దాంతో కురులు పొడిగా, పెళుసుగా మారతాయి. అందుకే సాధారణ నీళ్ళను ఉపయోగిస్తే బాగుంటుంది. చల్లని నీళ్లు కూడా వెంట్రుకులపై ద్రుష్పభావం చూపిస్తాయి. కాబట్టి చలికాలంలో గోరువెచ్చిన నీళ్లు, వేసవిలో సాధారణ నీళ్లను ఉపయోగించాలి.

**ట్రిమ్మింగ్ ముఖ్యం:**

కురులను పొడవుగా చేయడానికి ముందు చిట్లిపోయిన వెంట్రుకులను ట్రిమ్మింగ్ చేయించాలి. ఇలా చేయకపోతే, చిట్లిన కురులు ఇతర కురులను కూడా బలహీనపరుస్తాయి. ఎనిమిది లేదా పది వారాలకు ఒకసారి జుట్టును ట్రిమ్మింగ్ చేయడం మంచిది. జుట్టుకు మెత్తగా లేదా గట్టిగా మార్చే స్టయిలిష్ జెల్‌ని కేవలం ప్రత్యేక సందర్భాల్లోనే ఉపయోగిస్తే మంచిది.

వేళ్ల కణుపుతో స్కాల్ఫ్ మసాజ్ చేయొచ్చు. షాంపూను అప్లై చేస్తున్న ప్పుడు కూడా ఇలా చేయవచ్చు. వారంలో 2-3సార్లు హెయిర్ బ్రష్‌తో శుభ్రం చేయండి.



దుమ్ము లేదా నూనె వెంట్రుకల్లో చేరకుండా చూడండి.

**నేచురల్ మాయిశ్చరైజర్:**

నేచురల్ హెయిర్ టానిక్ వాడితే వెంట్రుకలకు నేచురల్ మాయిశ్చరైజర్ లభిస్తుంది. వారంలో రెండు సార్లు ఆలివ్ ఆయిల్, బాదం, ఆముదం, నూనెను సమానంగా కలిపి సాయంత్రం ఈ నూనెతో చర్మంపై మసాజ్ చేసి మర్నాడ్ హెర్బల్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకుల మూలాలు దృఢంగా మారుతాయి. చాలామంది చర్మానికి, ముఖానికి ఇచ్చే ప్రాముఖ్యతను జుట్టు అందానికి ఇవ్వరు. కొందరు తరచుగా షాంపూలను మారుస్తుంటారు. మార్కెట్లో దొరికే హెయిర్ ఆయిల్స్‌ను వాడుతుంటారు. ఎలా చేసినా వారి జుట్టు చుండ్రుతో నో..మరేదో సమస్యతోనో ఊడి పోతుంటుంది. ఆడవారు ఎంత అందంగా ఉన్నా... జుట్టు అందంతో వారికి మరింత అందం పెరుగుతుంది. కొన్ని రకాల జాగ్రత్తలతో జుట్టును ఒత్తుగా నిగనిగలాడేలా చేసు కోవచ్చు.

1. నిమ్మకాయ రసంతో తలంతా మర్ధన చేసుకున్నా కూడా చుండ్రు నివారణ అవుతుంది. 2. మందార పువ్వులను ఎండబెట్టి కొబ్బరినూనెలో వేసి మరిగించి ఆ మిశ్రమాన్ని చల్లారాక ఒక సీసాలో నిలవచేసుకుని ప్రతిరోజూ రాసుకుంటే చుండ్రు నివారణ అవుతుంది. 3. గోరింటాకు ఎండబెట్టి పొడిగా చేసుకుని కొబ్బరినూనెతో కలిపి రాసుకుంటే వెంట్రుకలు నిగనిగలాడతాయి.

# ఏకాగ్రతకు ఏం చేస్తున్నారు?

*ఏదైనా పనిచేసేటప్పుడు ఏకాగ్రత కోల్పోతున్నారా ? ప్రతిసారీ.. మీరు చేసే పనిలో కాన్సంట్రేషన్ మిస్ అవుతున్నట్టు గమనిస్తున్నారా ? ఏకాగ్రత కుదరకపోవడం వల్ల.. మీకున్న టాస్క్‌లు పూర్తి చేయలేకపోతున్నారా ? అయితే.. దానికి కారణాలు ఖచ్చితంగా తెలుసుకోవాల్సిందే. మీ ఏకాగ్రతను నాశనం చేస్తున్నదేంటో ఒక్కసారి చూడాలి. ఏకాగ్రత కోల్పోతే.. మీరు చేసే పనిలో క్వాలిటీ తగ్గిపోతుంది. చేసే పనిలో ఫోకస్, శ్రద్ధ ఉంటేనే.. అది సక్సెస్ అవుతుంది. ఉదాహరణకు మీకు ఏకాగ్రత తగ్గినప్పుడు ఎగ్జామ్స్‌కి లేదా టెస్ట్‌లకు చదవడం కూడా కష్టమవుతుంది. దీనివల్ల ఫలితాలు తారుమారు అవుతాయి. ఇది ఎడ్యుకేషన్ పైనా ద్రుష్పభావం చూపుతుంది. ఏకాగ్రత తగ్గిపోతే.. మీ పనిచేసే ఆఫీస్‌లోకూడా రిలేషన్స్ తగ్గిపోతాయి. మీకిచ్చిన టాస్క్‌లు పూర్తిచేయకపోతే మీపై దురభిప్రాయం ఏర్పడుతుంది. అలాగే మిమ్మల్ని ప్రేమించే వ్యక్తి చెప్పే మాటలను శ్రద్ధగా వినలేకపోతే.. వాళ్ల ప్రేమను మిస్సవ్వాల్సి వస్తుంది. కాబట్టి.. ఏకాగ్రత అనేది జీవితంలో చాలా ముఖ్యమైనది. ఏకాగ్రత కోల్పోవడానికి చాలా కారణాలుంటాయి. మీ ఉద్యోగం, అలసట, అనారోగ్య సమస్యలు కూడా ఏకాగ్రత కోల్పోవడానికి కారణమవుతాయి. కాబట్టి.. ముఖ్యంగా ప్రతి ఒక్కరిలో ఏకాగ్రత కోల్పోవడానికి కొన్ని ప్రధాన కారణాలున్నాయి. వాటిని ఒక్కసారి చూడటం వల్ల.. ఏకాగ్రత మిస్ అవకుండా.. జాగ్రత్త పడవచ్చు. ఎక్కువగా సోషల్ మీడియా ఉపయోగించడం ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. కొత్త కొత్త అప్ డేట్స్, ఇంట్రెస్టింగ్ ఇన్ఫర్మేషన్ అందించడం ఇలా.. రకరకాలుగా.. ప్రయత్నిస్తూ.. వాళ్లు ఏకాగ్రతను మొత్తం సోషల్ మీడియాలో పెడుతూ.. వర్క్, స్టడీస్ మీద పెట్టడం లేదు. పదే పదే ఫోన్లను చూస్తూ ఉండటం వల్ల.. సోషల్ మీడియా అప్ డేట్స్, సెల్ఫీలు పోస్ట్ చేయడం వల్ల.. మీ కాన్సంట్రేషన్ లెవెల్స్ చాలా త్వరగా తగ్గిపోతున్నాయి. ఒక్కోసారి ఆకలి కూడా.. ఏకాగ్రత లెవెల్స్ తగ్గించడానికి కారణమవుతుంది. తరచుగా ఆకలివేయడం, ఏమీ తినకపోవడం వల్ల మీ ఏకాగ్రత డైవర్ట్ అవుతుంది. మళ్లీ ఆకలిగా అనిపిస్తుంది. దీనివల్ల ప్రస్తుతం చేస్తున్న పనిపై ఏకాగ్రత పెట్టలేకపోతారు. కాబట్టి మిమ్మల్ని మీరు ఏకాగ్రత కోల్పోకుండా ఉండాలంటే.. హెల్తీ ఫుడ్ తీసుకోవాలి. దీనివల్ల ఏకాగ్రత కావాల్సినంత ఉంటుంది. డిప్రెషన్ డిప్రెషన్ లేదా అత్యంత ఎక్కువ ఒత్తిడి, ఆందోళన కాన్సంట్రేషన్ కోల్పోవడానికి కారణమవుతుంది. మైండ్ ఎప్పుడు ఆలోచనలతో నిండిపోతే.. లేదా ఒత్తిడికి గురవుతూ ఉంటే.. ఏ పనిశ్రద్ధగా చేయలేకపోతారు. ఎప్పుడూ ఏదో కోల్పోయిన ఫీలింగ్ వెంటాడుతుందే తప్ప చేసే పనిలో ధ్యాస పెట్టలేకపోతారు. డిప్రెషన్ వల్ల బాధగా ఉండటం, ఆసక్తికోల్పోవడం వంటి వన్నీ.. ఏకాగ్రత కోల్పోవడానికి కారణమవుతుంది. కాబట్టి.. ఏకాగ్రత కోల్పోతున్నారని గ్రహించిన వెంటనే.. తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.*

# ఇక స్కాటెగ్జిట్...?

బ్రెగ్జిట్ ప్రకంపనలు సద్దుమణగడం ప్రారంభం కాకముందే బ్రిటన్ పలు విధాలుగా రాజకీయ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. పర్యవసానాలు బ్రిటన్ సరిహద్దులను దాటి, ఐరోపా ఖండం అంతటికీ వ్యాపిస్తాయేమోననే ఆందో ళన సైతం వ్యక్తమౌతోంది. ఈయూ సభ్యత్వంపై మరోమారు ప్రజాభిప్రాయసేక రణ జరపాలనే ఒత్తిడి పెరుగుతుండగా, స్కాట్లాండ్ ప్రథమ మంత్రి నికోలా స్టర్జన్ బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుతూ మరోమారు ప్రజాభిప్రాయసేకరణ జరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ప్రకటించారు. స్కాటెగ్జిట్‌కు అనుకూలంగా స్కాట్లు మొగ్గుతున్నారు. ఈయూ నుంచి బ్రిటన్ తప్పుకున్నా స్కాట్లాండ్ మాత్రం కొనసాగడానికి తగు ఏర్పాట్లు చేయాలనే తన వాదనను అది లగ్జెంబర్గ్‌లో జరిగిన ఈయూ కౌన్సిల్ సమావేశానికి విన్నవించింది. బ్రిటన్‌లో స్వయంప్రతిపత్తి కలిగిన భాగంగా ఉన్న స్కాట్లాండ్‌కు విడిగా ఈయూలో సభ్యత్వాన్ని కొనసాగించడం సాధ్యం కాదనే చెప్పాలి.

ఇంగ్లిష్ వారి ఆధిపత్యం పట్ల స్కాటిష్ ప్రజలకున్న అసం తృప్తికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఆ జాతీయ ఆకాంక్షల ఆధారంగానే స్టర్జన్ నేతృ త్వంలోని స్కాటిష్ నేషనలిస్ట్ పార్టీ బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యాన్ని చాలా కాలంగా డిమాండు చేస్తోంది. 2014లో స్కాట్లాండ్ స్వాతంత్ర్యం కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో 55 శాతం బ్రిటన్‌లో భాగంగా ఉండాలని కోరుకున్నారు. బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం అంటే ఈయూలో సభ్యత్వాన్ని కోల్పోవడమనే వాదన ఆనాడు ఐక్యతావాదుల ప్రధాన అస్త్రం అయింది. బ్రిటన్ పౌరులుగా కంటే ఈయూ పౌరులుగా తమ అస్తిత్వానికి ఎక్కువ విలువనిచ్చే స్కాట్లు ఈయూ సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వస్తుందనే ఐక్యతావాదుల వైపు మొగ్గు చూపారు. అలాగే బ్రెగ్జిట్ ఓటింగ్‌లో కూడా ఈయూ సభ్యత్వానికి అనుకూలంగా వారు 62 శాతం మద్దతు పలికారు.

ఈ నేపథ్యంలోనే స్టర్జన్ ఏది ఏమైనా స్కాట్లాండ్ ఈయూలో సభ్యత్వాన్ని కొనసాగిస్తుందని, స్వాతంత్ర్యం కోసం మరోమారు ప్రజాభిప్రాయసేకరణకు వేళ తామని ప్రకటిస్తున్నారు. ఈయూ అధ్యక్షుడు మార్టిన్ షుల్జ్‌తో సైతం చర్చిస్తున్నారు.

2014 స్కాట్లాండ్ ప్రజాభిప్రాయ సేకరణలో ఈయూ మౌనం వహించింది. బ్రెగ్జిట్ తదుపరి కూడా అది అదే వైఖరిని అనుసరిస్తుందా అని చెప్పలేం. కానీ జర్మన్ చాన్సలర్ ఏంజెలా మర్కెల్ ముఖ్య మిత్రపక్షానికి చెందిన సీనియర్ సెనేటర్ గుంథర్ క్రిచ్‌బామ్ బ్రిటన్ నిష్క్రమించినా ఈయూ సభ్యత్వం 28గానే ఉంటుంది. స్కాట్లాండ్ స్వాతంత్ర్యం కోసం కొత్తగా ప్రజాభిప్రాయసేకరణను కోరుతుంది, అది ఎలాగూ నెగ్గుతుంది అని చేసిన వ్యాఖ్యలు బ్రెగ్జిట్ తదుపరి కొందరు ఈయూ ప్రముఖుల ఆలోచనా సరళిలో వచ్చిన మార్పును సూచిస్తుంది. ఇదిలా ఉండగా బ్రిటన్‌లోని మరో స్వయంప్రతిపత్తి ప్రాంతం ఉత్తర ఐర్లాండ్‌లో సైతం బ్రిటన్ నుంచి విడిపోయి, ఐర్లాండ్‌లో ఐక్యం కావాలనే డిమాండు ఊపందుకునే సూచనలు కనిపిస్తున్నాయి. బ్రెగ్జిట్ ఓటింగ్ లో స్కాట్లలాగే ఐరిష్ ప్రజలు కూడా ఈయూ సభ్యత్వానికి వ్యతిరేకంగా ఎక్కువగా ఓటు చేశారు. స్కాట్లలాగే, ఐరిష్ ప్రజలకు కూడా బ్రిటన్‌తో ఉన్న వైషమ్యాలు చారిత్రకమైనవి. ఉత్తర ఐర్లాండ్‌లోని ఐఆర్‌ఏ తిరుగుబాటు 1997కుగానీ సద్దుమణగ లేదు.

2014లో స్కాట్లాండ్ స్వాతంత్ర్యం ప్రజాభిప్రాయం తమ వంటి దేశాలలో వేర్పాటువాద ఉద్యమాలను ప్రోత్సహిస్తుందని స్పెయిన్ అప్పట్లో ఆందోళన వ్యక్తం చేసింది. బ్రెగ్జిట్ తదుపరి స్పెయిన్‌లోని కెటలోనియా స్వాతంత్ర్యం డిమాండు ఊపందుకుంటోంది. గత ఏడాది కెటలోనియన్ పార్టీలు నిర్వహించిన అనధికారిక ప్రజాభిప్రాయసేకరణలో 80 శాతం కెటలోనియన్లు స్వాతంత్ర్యం కోరారు. స్పెయిన్ నుంచి విడిపోయినా సంపన్న వంతమైన కెటలోనియాను ఈయూ వదులుకోదని స్వాతంత్ర్యవాదులవాదన. గ్రీస్, పోర్చుగల్, ఇటలీలలాగే స్పెయిన్ కూడా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. 21 శాతం నిరుద్యోగంతో దారీతెన్నూ లేని స్థితిలో ఉంది. పైగా 1975లో ఫ్రాంకో మరణానంతర పరిస్థితికి మించిన తీవ్ర రాజకీయ ప్రతిష్టంభనలో కొట్టుమిట్టాడుతోంది.

స్పానియార్డులు ఈ నెల 26న జరిగిన ఎన్నికల్లో కూడా గత డిసెంబర్‌లోలాగే ఏ పార్టీకి మెజారిటీ రాని పరిస్థితిని పునరావృతం చేశారు. ఏకైక ప్రధాన పార్టీగా తిరిగి అవతరించిన పాప్యులర్ పార్టీ నేత ప్రధాని మరియానో రజాయ్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ పరిస్థితుల్లో కెటలోనియన్ స్వాతంత్ర్యం డిమాండు తిరిగి తెరపైకి వస్తోంది. బ్రెగ్జిట్, కెటలోనియన్లలోనే కాదు, దూరంగా ఉన్న కెనడాలోని క్యుబెక్ జాతి స్వాతంత్ర్య కాంక్షలకు సైతం కొత్త ఊపిరు లూదుతోంది.

ఆంక్షలు లేని స్వేచ్ఛాయుత యూరప్ నిర్మాణమనే ఈయూ మౌలిక లక్ష్యానికి బ్రెగ్జిట్ పర్యవసానంగా విషమిస్తున్న జాతి వైరుధ్యాలు సవాలుగా నిలుస్తున్నాయి. జాతీయవాదం, జాత్యహకారవాదం, గుడ్డి ముస్లిం వ్యతిరేకత, వల సదార్లపట్ల వ్యతిరేకత వంటి ధోరణులు బలపడుతుండటం దేశాలకు, జాతులకు అతీతంగా యూరప్‌ను ఆర్థికంగా, రాజకీయంగా ఐక్యం చేయాలనే దాని ఆకాంక్షకు అపవా దంగా నిలుస్తున్నాయి. బ్రెగ్జిట్ ఫలితాల తదుపరి ఫ్రాన్స్, నెదర్లాండ్స్, డెన్మార్క్, స్వీడన్, జర్మనీ తదితర దేశాల్లోని పచ్చి మితవాద పార్టీలు ఈయూ నుంచి నిష్క్రమణకు ప్రజాభిప్రాయ సేకరణలు జరపాలని కోరడం ప్రారంభిం చాయి. ఫ్రెగ్జిట్ (ఫ్రాన్స్), నెగ్జిట్ (నెదర్లాండ్స్) వంటి పిలుపులు వెల్లువెత్తుతు న్నాయి. ఇవన్నీ నేడు బలహీన ధోరణులే అయినా ఈయూ ఆర్థిక విధానాలను, అది ప్రజలపై అమలు చేసిన, చేస్తున్న కఠోరమైన పొదుపు చర్యలు, సంక్షేమ వ్యయాల కోతల పర్యవసానాలుగా ఉత్పన్నమవుతున్నాయి. ఫలితంగా తలెత్తుతున్న సామాజిక అసంతృప్తికి యూరప్‌కు వలస వచ్చేవారు బలిపశువులు అవుతుండటం విషాదకరం. 2011-12లలోని ఈయూ సంక్షోభం పరిష్కారం కాకపోవడమే స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి జాత్యహంకార, విచ్ఛిన్నకర, విధ్వంసకర ధోరణుల వరకు అన్ని అవాంఛనీయ ధోరణులకు ఊపిరులు పోస్తోంది. చారిత్రక శత్రువులు ఎలా సన్నిహిత భాగస్వాములు కాగలరో ఈయూ నిరూపించి చూపించింది అని నోబెల్ కమిటీ 2012లో ఈయూకు నోబెల్ శాంతి బహుమతిని ప్రకటిస్తూ పేర్కొంది. నేటి పరిణామాలు ఆ మాటలను అపహాస్యం చేస్తున్నట్టుండమే వైచిత్రి. ఐరాపా సంయుక్త రాష్ట్రాలను ఏర్పరచాలనే ఈయూ వ్యవస్థాపకుడు జీన్ మన్నెన్ కల నిజమౌతున్నదా? కరిగిపోనున్నదా?

# చిత్రభాను

## బాలయ్య లవ్ స్టోరీ



నందమూరి బాలకృష్ణ అభిమానిపై చేయి చేసుకోవడాన్ని సమర్థిస్తూ చేసిన వ్యాఖ్యలపై దర్శకుడు పూరీ జగన్నాథ్‌ను నెటిజన్లు వెక్కిరిస్తున్నారు. అభిమానులను బాలయ్య కొట్టడాన్ని సమర్థిస్తూ, దాన్ని ప్రశంసిస్తూ పూరీ వ్యాఖ్యలు చేశారు. తాను దర్శకత్వం వహించిన పైసా వసూల్ ఆడియో విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభిమానులను బాలయ్య కొట్టడాన్ని లవ్ స్టోరీగా అభివరి?ంచారు. ఆ కార్యక్రమం ఇటీవల ఖమ్మంలో జరిగిన విషయం తెలిసిందే. నంద్యాలలో అభిమాని చెంప చెళ్లు..(వీడియో) అప్పటి నుంచి ఆయనపై, బాలయ్యపై సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు విసురుతూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. వారిద్దరిదీ లవ్ స్టోరీ అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఇతర హీరోలు బయటకు వెళ్లినప్పుడు వారందరికీ బౌన్సర్లు కావాలని, కానీ బాలయ్యగారికి బౌన్సర్ల అవసరం లేదని పూరీ జగన్నాథ్ అన్నారు. అభిమానులను ఆయన స్వయంగా కంట్రోల్ చేయగలరని అన్నారు. వారు తన మీద పడితే బాలయ్య కొట్టేస్తారని చెప్పారు. బాలయ్య కొట్టడాన్ని అభిమానులు ఇష్టపడుతారని, దాన్ని ప్రేమిస్తారని పూరీ జగన్నాథ్ చెప్పారు. ఆనందిస్తారని కూడా అన్నారు. తమను బాలయ్య కొడితే అభిమానులు ఎంతగా ఆనందిస్తారనే విషయం మీడియాకు తెలియదని ఆయన అన్నారు.

కామన్స్ సెన్స్ లేకుండా ప్రవర్తించినప్పుడు బాలయ్య చేయి చేసుకుంటారని, బాలయ్యకూ ఆయన అభిమానులకూ మధ్య ఉన్న ఆ అనుబంధాన్ని గుర్తుంచుకోవాలని పూరీ జగన్నాథ్ అన్నారు. బాలయ్య ఫ్యాన్‌ను కొడితే అదో లవ్ స్టోరీ అని ఆయన అన్నారు. దాన్ని సీరియస్‌గా తీసుకోవద్దని ఆయన అన్నారు. పూరీ జగన్నాథ్ ఆ వ్యాఖ్యలు చేసిన తర్వాత నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతూ వస్తున్నారు. భౌతికమైన దాడి ప్రేమగా ఎలా మారుతుందని వారు అడుగుతునన్నారు.

తన్నించుకుంటే మహాప్రసాదం. కొట్టించుకుంటే ఆశీర్వాదం. ఏకంగా చంపేస్తే కుంభాభిషేకం. ఇది కొత్త దేవుళ్ల వ్యవహారం అని వ్యాఖ్యానిస్తున్నారు.. బాలయ్య అభిమానులపై చేయి చేసుకోవడంపై పూరీ జగన్నాథ్ వ్యాఖ్యలు ఏ సందర్రేలో చేశారనేది ఆసక్తికరమైన విషయం. నంద్యాల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బాలయ్య ఓ అభిమానిపై చేయి చేసుకోవడం మీద తీవ్ర దుమారం చెలరేగింది. ఆ తర్వాత పైసా వసూల్ ఆడియో లాంచ్ కార్యక్రమం జరిగింది. దాంతో పూరీ బాలయ్యపై చెలరేగిన దుమారాన్ని ద ృష్టి ఉంచుకుని ఆ వ్యాఖ్యలు చేశారు.

## అఖిల్ ఫస్ట్ లుక్ లీకయ్యింది



అక్కినేని అఖిల్.. హీరోగా అఖిల్ తోనే ఫెయిలయ్యాడు అయితే ఈ సారి మళ్ళీ కొత్త స్టైల్ లో ఇంకో ప్రయత్నం చేస్తున్నాడు.అఖిల్ విక్రమ్ కుమార్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాకు చెందిన ఫస్ట్ లుక్ ఫొటో ఒకటి ఇప్పుడు అక్కినేని అభిమానులను అలరిస్తోంది.

ఇది లీక్ చేసిందా లేక లీకైందా అనే విషయం మాతం ఎవ్వరినీ అడగవద్దు.. ఎందుకంటే ఎవ్వరికీ తెలియదనే అంతా అనుకుంటున్నారు మరి... చిత్ర యూనిట్ చాలా జాగ్రత్తగానే ఉందట కానీ లీకువీరులు అంతకంటే బలంగా ఉన్నారు, దాంతో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫస్ట్ లుక్ లీక్ ని ఆపలేకపోయారు. దీంతో సినిమా యూనిట్, అక్కినేని కాంపౌండ్ షాక్ కి గురైనా.. లీక్ అయితే నష్టమేముందిలే అని నాగార్జున సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రేపు సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నామని నాగ్ తెలిపారు. 21న బిగ్ సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారట. దానికి సంబంధించిన క్లూ ఇస్తారట. ఈ విషయాన్ని స్వయంగా నాగార్జున సోషల్ మీడియాలో వెల్లడించారు. చిత్ర హీరో అఖిల్ కూడా ఫస్ట్ లుక్ లీకవడంతో షాకైనా.. ఫస్ట్ లుక్ ఫుల్ క్లారిటీ అంటూ ఓ స్టిల్‌ని రిలీజ్ చేశారు.

ఈ చిత్రానికి విక్రమ్ కె కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు.

ఫస్ట్ లుక్ స్టిల్ అయితే వెరైటీగానే ఉంది. మరో ప్రక్క ఈ చిత్రం టైటిల్ ఫిక్స్ అయిందనే వార్త వినిపిస్తుంది. అన్నపూర? స్టూడియోస్ బ్యానర్ పై యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు మొన్నటి వరకూ జున్ను అనే టైటిల్ ప్రచారంలో ఉండగా... తాజాగా అన్నపూర? స్టూడియోస్ బ్యానర్ పై ఈ సినిమా కోసం 'రంగుల రాట్నం' అనే టైటిల్ ను రిజిస్టర్ చేయించారని టాక్.

## మళ్లీ ఫిదా చేయబోతున్న సాయి పల్లవి



'ఫిదా' బ్యూటీ సాయి పల్లవి నటించిన మళయాలం మూవీ 'కలి' తెలుగులో విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రానికి తెలుగులో 'హేయ్ పిల్లగాడ' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. లక్ష్మీ చెన్నకేశవ ఫిలింస్ పతాకంపై సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ డి.వి.క ృష?స్వామి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సినిమా లోగోను దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. సమీర్ తాహిర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దుల్కర్ సల్మాల్ హీరో. యాక్షన్ థ్రిల్లర్ మూవీ. మళయాలంలో ఈ చిత్రం భారీ విజయం సాధించింది. 'ఫిదా' మూవీతో సాయి పల్లవికి ఇక్కడ మంచి క్రేజ్ వచ్చిన నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. "దుల్కర్ సల్మాన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం కలి. ఈ చిత్రం మలయాళం, తమిళంలో పెద్ద విజయాన్ని సాధించింది. ఈ సినిమాను తెలుగులో హే పిల్లగాడా! అనే పేరుతో విడుదల చేస్తున్నారు. తెలుగులో సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటూ దుల్కర్, సాయిపల్లవి సహా నిర్మాతకు అభినందనలు" అని వ్యాఖ్యానించారు. ఈ చిత్రం తెలుగు వెర్షన్ రచయిత భాషా శ్రీ మాట్లాడుతూ...."హే..పిల్లగాడా సినిమా అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. సినిమా చాలా చక్కగా వచ్చింది. హేమచంద్ర హీరో వాయిస్‌కు డబ్బింగ్ చెప్పారు.ఈ సినిమాలో నేను భాగమైనందుకు ఆనందంగా ఉంది" అన్నారు. ఈ చిత్రానికి తెలుగు పాటలు రాసిన సురేంద్ర క ృష? మాట్లాడుతూ "సెప్టెంబర్ 8న హేయ్..పిల్లగాడ సినిమా విడుదలవుతుంది.

ఈ సినిమాలో మంచి మెలోడి పాట రాయడం ఆనందంగా ఉంది. తప్పకుండా ప్రేక్షకులను మెప్పించే సినిమా అవుతుంది. దుల్కర్, సాయిపల్లవి జోడి క్యూట్‌గా ఉంటుంది. మంచి రొమాంటిక్ లవ్ స్టోరీ. కాస్తా యాక్షన్ పార్ట్ కూడా ఉంటుంది అన్నారు. నిర్మాత డి.వి. క ృష? స్వామి మాట్లాడుతూ... " ఓకే బంగారం దుల్కర్ సల్మాన్, ఫిదా సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం హేయ్..పిల్లగాడ. ఇదొక టిపికల్ లవ్‌స్టోరీ. సెప్టెంబర్ 8న సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాను ఫిదాలాగానే సక్సెస్ చేస్తారని భావిస్తున్నాం" అన్నారు.

## మహేష్ బాబు మూవీకి అనుమతి నిరాకరణ

'శ్రీమంతుడు' లాంటి భారీ విజయం తర్వాత మహేష్ బాబు, కొరటాల శివ కాంబినేషన్లో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. 'భరత్ అను నేనే' అనే టైటిల్ తో తెరకెక్కబోతున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు లక్నోలో చిత్రీకరించాలని ప్లాన్ చేయగా..... అనుమతి లభించలేదు. లక్నోలోని చారిత్రక ప్రదేశం మూసాబాగ్ వద్ద సినిమా షూటింగ్ ప్లాన్ చేశారు. ఈ మేరకు అనుమతి కోసం స్థానిక అధికారులను సంప్రదించగా.... 'ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా' అధికారులు అనుమతి నిరాకరించారు. లక్నోలో దాదాపు నెల రోజుల పాటు షూటింగ్ జరుగాల్సి ఉంది. అయితే అనుకోకుండా అనుమతి నిరాకరణ ఎదురవ్వడంతో షూటింగ్ ప్లాన్, షెడ్యూల్ అంతా అప్ సెట్ అయింది. అనుమతి నిరాకరణకు కారణాలు చాలా ఉన్నాయి. అక్కడ ఏ వస్తువులను తాకొద్దని, చివరకు గోడలను కూడా టచ్ చేయకుండా ఉండాలని కఠినమైన నిబంధనలు ఉన్నాయి. మూసా బాగ్ చారిత్రక ప్రదేశం కావడంతో ఇలాంటికఠినమైన నిబంధనలు ఉన్నాయి. అందుకే సినిమా షూటింగుకు అనుమతి ఇవ్వలేదు.



## సన్నీ లియోన్.. రచ్చ.. రచ్చ..

ఈ మధ్య కాలంలో బాగా పాపులర్ అయిన కండోమ్ యాడ్ ఏదైనా ఉంది అంటే... అది సన్నీ లియోన్ నటించిన మ్యాన్ ఫోర్స్ కండోమ్ యాడ్. ఈ యాడ్ ఇపుడు గోవా స్టేట్ అసెంబ్లీలో చర్చనీయాంశం అయింది. ఈ యాడ్ విషయంలో ప్రతిపక్ష నేతలు రచ్చ రచ్చ చేశారు. ఈ యాడ్ మీద ఇంత గొడవ జరుగడానికి కారణం గోవా ప్రభుత్వం నిర్వహిస్తున్న 'కదంబ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్ప్' బస్సులో ఈ కండోమ్ యాడ్‌కు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్స్ ఉండటమే. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గోవా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎస్టీ ఆడ్రూ ఫ్రాన్స్ సిల్వెయిరా వాదించారు. ఈ బస్సులో స్టూడెంట్స్, మహిళలు ప్రయాణిస్తున్నారు, ఈ యాడ్స్ వారికి ఇబ్బంది ఉన్నాయని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. గోవాలో మహిళా సంఘాలు కూడా గతంలో ఈ యాడ్ మీద అభ్యంతరం వ్యక్తం చేశాయి. సన్నీ లియోన్ కండోమ్ యాడ్ కు సంబంధించిన స్టిక్కర్లు పబ్లిక్ ట్రాన్స్ పోర్టులో అతికించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కండోమ్ యాడ్స్ అంటే అశ్లీలత ఉట్టిపడేలా ఉంటాయనే భావన మొదటి నుండి ఉంది.



## రోగుల రక్తాన్ని పిండేస్తున్న

# కార్పోరేట్ ఆసుపత్రి

- మైమరపిస్తున్న ఠాకూర్ సినీ సన్నివేశాలు
- నిత్యం ఆసుపత్రిని వెంటాడుతున్న వివాదాలు
- తెర వెనుక దేశం పార్టీ నాయకుడు


ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

అనకాపల్లి : ప్రజల ఆరోగ్యాలతో కొన్ని కార్పోరేట్ ఆసుపత్రులు చెలగాటం అడుతున్నాయి. వైద్యసేవలతో ప్రజల మన్ననలు పొందాల్సిన ఈ ఆసుపత్రులు వ్యాపారమే పరమావధిగా సాగిపోతున్నాయి. ప్రమాదాలు జరిగి కొన ప్రాణంతో ఆసుపత్రికి చేరిన క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందించకుండా ముందుగా డబ్బు చెల్లించండి తర్వాత చేర్చండి అని ఖరాఖండీగా చెబుతుండడం దిగజారిన వైద్యవిధానానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అనకాపల్లిలో కొన్ని ఆసుపత్రులు సేవాభావంతో పనిచేస్తున్నప్పటికీ మరి కొన్ని మాత్రం పూర్తిగా వ్యాపారకేంద్రంగా మారిపోయాయని చెప్పాలి. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్‌లో గత ఏడాది ఏర్పాటు చేసిన ఒక కార్పోరేట్ ఆసుపత్రి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైసలే పరమావధిగా, ఖరాఖండీగా రోగుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. పోనీ తీసుకున్న డబ్బుకు న్యాయం చేస్తూ వైద్యం చేస్తున్నారా అంటే అదీ లేదు. రోగి జాయిన్ అయిన దగ్గరనుంచి పిండుకోవడమే. దీంతో విసుగెత్తిన రోగి కుటుంబీకులు ఈ ఆసుపత్రి నుంచి వేరొక ఆసుపత్రికి తరలించే సన్నివేశాలు ఎన్నో జరిగాయి. విశాఖలోని కార్పోరేట్ ఆసుపత్రులలో కల్పించే వైద్యసేవలు ఇక్కడ లభ్యమౌతాయని హోరెత్తించే ప్రచారం చూసి ప్రజలు నిజమని భావించి ఇక్కడ చేరుతున్నారు. కాని మామూలు వైద్యసేవలే ఇక్కడ లభ్యమౌతున్నాయని పలువురు రోగులు పెదవి విరుస్తున్నారు. వైద్యసేవలు బాగోలేవని రోగి ఇక్కడ నుంచి కదలాలని ప్రయత్నిస్తే ఎడా పెడా బిల్లులతో బెంబెలెత్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో రోగి బంధువులు, ఆసుపత్రి యాజమాన్యాలు తరచూ గొడవ పడుతుండడం ఇక్కడ నిత్యమూ కనిపిస్తున్న దృశ్యం. నాలుగురోజుల క్రితం ఎలమంచిలికి చెందిన ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడితే అతని కుటుంబసభ్యులు ఈ ఆసుపత్రిలో చేర్చారు. అతని వైద్యానికి లక్షా 20వేల రూపాయలు అవుతుందని, ముందుగా 80వేల రూపాయలు చెల్లించాలని ఆసుపత్రివర్గాలు చెప్పడంతో విధిలేని పరిస్థితులలో క్షతగాత్రుని కుటుంబీకులు ఈ ఆసుపత్రిలో చేర్చారు. కాని నాలుగురోజులైన క్షతగాత్రుని పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు ఆసుపత్రి యాజమాన్యాన్ని నిలదీశారు. తాము ఖరీదైన వైద్యమే అందిస్తున్నామని, మీరు ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని, ఆ విధంగా చేస్తే త్వరగా కోలుకుంటారని చెప్పడంతో అప్పటికే తాహతుకు మించి వైద్యాన్ని చేయిస్తుండడంతో తమ పేషంట్‌ను తమకు అప్పగించాలని, విశాఖ కెజీహెచ్‌కు తీసుకువెడతామని క్షతగాత్రుని కుటుంబీకులు తెలిపారు. దీనికి ఆసుపత్రి వర్గాలు అంగీకరించకపోవడంతో వివాదం చెలరేగింది. క్షతగాత్రుని బంధువులు, వైకాపా పార్టీ, ప్రజాసంఘాలు ఆసుపత్రి ముందు ధర్నాకు దిగాయి. ఎలమంచిలి, అనకాపల్లి ప్రాంతాల నుంచి క్షతగాత్రుని బంధువులు, వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు రంగప్రవేశం చేయడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. క్షతగాత్రుడు ఆసుపత్రిలో చేరిన దగ్గర నుంచి ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో ఉన్నాడని కనీసం తమని చూడనివ్వలేదని కుటుంబీకులు ఆరోపణలు చేయడంతో అసలు క్షతగాత్రుడు బ్రతికే ఉన్నాడా ? లేక ఠాకూర్ సినిమా సన్నివేశాలు ఇక్కడ జరుగుతున్నాయా ? అనే సందేహాలు అంతటా నెలకొన్నాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలకు సర్దిచెప్పారు. అలాగే గతంలో ఇలాగే మునగపాక మండలం, తోటాడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో ఇదే ఆసుపత్రిలో చేర్చారు. ఇంచుమించుగా ఇవే సన్నివేశాలు చోటుచేసుకోవడంతో మొత్తం ఆ గ్రామం అంతా తరలివచ్చి ఆసుపత్రి ముందు ధర్నాకు దిగింది. ఇటువంటి సన్నివేశాలు తరచూ ఇక్కడ జరుగుతూనే ఉంటాయి.

తమ వెనుక అధికారపార్టీ నాయకుడు ఉన్నారనే ధీమా ఏమో తెలియదు కాని ఆసుపత్రి వర్గాలు మాత్రం బరి తెగించి ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే వెనుక నీడలా అనుక్షణం ఉంటే ఈ నాయకుడు ఘర్షణలు జరిగినపుడు పోలీసులను మేనేజు చేయడం, సమస్యను వెలుగులోకి రాకుండా చేస్తుండడంతో ఆసుపత్రి వర్గాలు తమదైన శైలిలో దూసుకుపోతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆసుపత్రిలో రోగులను తమకు అధికారపార్టీ బలం ఉందని, ఏమైనా చేయగలమని బెదిరింపులు, దౌర్జన్యాలు కూడా జరుగుతున్నట్లు తెలిసింది.

ఆసుపత్రికి ఎమ్మెల్యే పీలా గోవింద అండదండలు ఉన్నాయని చెప్పడానికి ఆడపా దడపా ఆసుపత్రిలో ఏదో కార్యక్రమం చేపట్టి ఎమ్మెల్యే లేదా వారి తనయుడిని పిలిచి చిన్న చిన్న కార్యక్రమాలు చేస్తూ తన ఉనికిని చాటుకుంటున్నాడీ నాయకుడు.

# బాబు మోసాలకు వ్యతిరేకంగా ఓటువేద్దాం

## జోరువానలో వైఎస్ జగన్ భారీ రోడ్‌షో



నంద్యాల: మూడున్నరేళ్ల చంద్రబాబునాయుడు అవినీతి, మోసపూరితమైన పాలనకు వ్యతిరేకంగా నంద్యాల ఉప ఎన్నికలో ఓటు వేద్దామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. నంద్యాలలో ఉప ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఎవరో ఒక వ్యక్తిని ఎమ్మెల్యే చేసుకోవడానికో ఈ ఉప ఎన్నిక జరగడం లేదు. మూడున్నరేళ్ల చంద్రబాబు పరిపాలనపై ఇవాళ ఉప ఎన్నిక జరుగుతోంది. చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలకు వ్యతిరే కంగా ఇవాళ మనం ఓటువేద్దాం. చంద్రబాబు పరిపాలనలోని అవినీతికి వ్యతిరేకంగా ఇవాళ ఓటు వేద్దాం' అని ఆయన పేర్కొన్నారు. నంద్యాలలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్ జగన్ ఆదివారం సాయంత్రం పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగించారు. జోరు వర్షంలోనూ కొనసాగిన ఈ రోడ్‌షోకు పెద్ద ఎత్తున జనం తరలిరావడం గమనార్హం. వైఎస్ జగన్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఈ మూడున్నరేళ్ల పాలనలో చంద్రబాబు చెప్పుకోవడానికి చేసిందేమీ లేదు.ఉప ఎన్నికలు వచ్చేదాక చంద్రబాబుగానీ, ఆయన మంత్రులుగానీ ఒక్కరోజైనా మీకు నంద్యాల రోడ్ల మీద కనిపించారా? ఎప్పుడూ రాలేదు.

ఎన్నికలకు ముందు ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలమిస్తాను, ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తానని చంద్రబాబు చెప్పారు.

ఈ మూడున్నరేళ్ల పాలనలో మీకు కనీసం ఒక్క ఇళ్లైనా కట్టించారా? కట్టించలేదు ఎన్నికల్లో ప్రతి పేదవాడికి సాగుభూమి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి.. ఒక్క ఎకరం భూమి అయినా ఇవ్వలేదు. రేషన్ దుకాణాల్లో ఇంతకుముందు బియ్యం, కిరసనాయిల్, కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి ఇలా పలురకాల వస్తువులు ఇచ్చేవారు. కానీ, చంద్రబాబు సీఎం అయ్యాక ఒక్క బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదు.

ఆ దివంగత నేత, ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారి పరిపాలనలో నంద్యాలలో 21800 పెన్షన్ కార్డులు ఉండేవి. చంద్రబాబు సీఎం అయ్యాక పెన్షన్ కార్డులు చాలావరకు తగ్గుతూ వచ్చాయి. నంద్యాల ఉప ఎన్నిక రావడంతో మళ్లీ పెన్షన్ కార్డులను పెంచారు. ఎన్నికలు అయ్యాక అవి ఉంటాయో లేదో తెలియదు

ఎన్నికల సమయంలో మద్యాన్ని తగ్గిస్తాం, బెల్టు షాపులు లేకుండా చేస్తామని చంద్రబాబు చెప్పారు.

ఈ మూడున్నరేళ్ల పాలనలో కనీసం ఒక్క బెల్టు షాపైనా చంద్రబాబు తగ్గించారా? లేదు.

పైగా మద్యం అమ్మకాలు నెలనెలా సంవత్సరం సంవత్సరం పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మద్యం హౌస్ డెలివరీ ఇచ్చే పరిస్థితి వచ్చింది.

జాబు రావాలంటే బాబు రావాలి అని ఎన్నికల్లో చంద్రబాబు జోరుగా ప్రచారం చేశారు. జాబు రాకపోతే ఇంటింటికి రూ. రెండువేల నిరుద్యోగభృతి ఇస్తానన్నారు. కానీ జాబు రాలేదు. భృతి ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ఈ 38 నెలల కాలంలో ప్రతి ఇంటికి రూ. 76వేల చొప్పున చంద్రబాబు బకాయి పడ్డారు.

డ్వాక్రా మహిళలకు రూ.14వేల కోట్ల రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశారు. కనీసం ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు.

## కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

విశాఖపట్నం: విదర్భ పరిసర ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని.. రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. కోస్తాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

## రూ.4కోట్ల విలువైన సిగరెట్లు దోపిడీ



చౌటుప్పల్: కోట్ల రూపాయల విలువైన సిగరెట్ల లోడుతో వెళ్తున్న కంటైనర్‌ను సినీఫక్కీలో అపహరించి సరుకును దొంగిలించుకుపోయిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో చోటు చేసుకుంది. హైదరా బాద్‌లోని ముషీరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి సిగరెట్ల లోడుతో వెళ్తున్న కంటైనర్‌ను అబ్దుల్లాపూర్‌మెట్ ఔటర్ రింగ్‌రోడ్ వద్ద కొందరు దుండగులు అడ్డగిం చారు. అనంతరం లారీలోకి ఎక్కి డ్రైవర్‌ను బంధించి చౌటుప్పల్ మండలం మల్కాపూర్ శివారుకు తరలించారు. కంటైనర్ డ్రైవర్‌ను సమీపంలోని గుట్టలోకి తీసుకెళ్లి వదిలేసి.. సిగరెట్ల లోడును తమ వాహనాల్లోకి ఎక్కించుకుని పరారయ్యారు. అనంతరం డ్రైవర్ తేరుకుని ఈ ఘటనపై చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ చెప్పిన వివరాలను కంటైనర్ జీపీఎస్‌తో నిర్ధారించుకున్న చేసుకున్న పోలీసులు దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

## సైనికులకు

# ఏసీ జాకెట్లు



దిల్లీ: దేశ రక్షణ చర్యల్లో పాల్గొనే ప్రత్యేక బలగాలకు ఎయిర్ కండీషన్డ్ జాకెట్లను కేంద్రం అందించనుంది. ఇందుకోసం కార్యాచరణ కూడా ప్రారంభించింది. అయితే వీటి తయారీకి ఏం వాడుతున్నారు, ఎలాంటి సాంకేతికత వినియోగిస్తున్నారన్న విషయాలను మాత్రం వెల్లడించలేదు.

ప్రత్యేక ఆపరేషన్‌లో పాల్గొనే సైనికుల శరీరాలు వెంటనే వేడెక్కుతాయి, అసౌకర్యానికి లోనవుతారు. అందుకే వారికి సౌకర్యంగా ఉండేందుకు ఏసీ జాకెట్లను వారికి అందించాలని అనుకున్నాం. వాటికి సంబంధించిన ట్రయల్స్ జరుగుతున్నాయి.

అని గోవా ముఖ్యమంత్రి, మాజీ రక్షణ శాఖ మంత్రి మనోహర్ పారికర్ తెలిపారు. పనాజీలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే అమెరికాలో వీటి వాడకం ఎప్పుడో మొదలైంది సైనికుల దుస్తుల్లో చిన్న బ్యాటరీని అమర్చి వాటిని వాడుతున్నారు.

# దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ



విశాఖపట్నం : శాస్త్రసాంకేతిక అభివృద్ధి పితామహుడు రాజీవ్‌గాంధీ అని ద్రోణం రాజు అన్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం నగర కాంగ్రెస్ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పూలమాలవు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు మాట్లాడుతూ భారత దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ అని అన్నారు. నేడు మనం ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్ గాని, ఇంటర్నెట్ వంటి సాంకేతిక ఉపకరణాలు ఉపయోగిస్తున్నామంటే రాజీవ్‌గాంధీయే కారణమని అన్నారు. శాస్త్రసాంకేతిక రంగాలను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని అగ్రస్థాయిలో నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. వినియోగదారుల హక్కు చట్టం, లోక్‌అదాలత్, 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి ఈ దేశ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ప్రధానిగా ఆయన చేసిన సంస్కరణలు మరిచిపోలేనివని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు రాజీవ్‌గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. రాజీవ్‌గాంధీకి విశాఖ నగరానకి మరిచిపోలేని అనుబంధం ఉందని అన్నారు.

ఆయన చివరి మజిలి విశాఖనగరం కావడం గొప్ప విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, బిసి సెల్ కొణతాల శ్రీనివాస్, నగర యుజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంపర సత్తిబాబు, కాంగ్రెస్ నాయకులు గొంపా గోవింద్, కె.తాతారావు, లింగం శ్రీనివాస్, బండారు శ్రీనివాసరావు, జగన్, పరదేశీ, మధు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాచ్ హౌస్ వద్ద, బీచ్ రోడ్డులోనూ ఉన్నరాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com